ఎనిమిదవ కుసుమము

సర్వ హక్కులు : ప్రకాశకులవి

పంచమ ముద్రణ : 1987

వెల : రు. 6-00

ముఖచిత్రము :
శ్రీ అనుభవానంద స్వాములవారు

ప్రతులకు :

శ్రీ అనుభవానంద గంథమాల

* బాపట్ల - 522 101 గుంటూరు (జిల్లా)

* భీమునిపట్నము - 531 163 విశాఖ (జిల్లా

ప్రస్తావనము

'మన శారదామాయి' అను చిన్ని పొత్తమును, మన మాతాజీ బంధుమిత్రాది సంఘమును ద్యజించి, పూర్వాదర్శముల బ్రక్కనుంచి, మహోత్కృష్టాదర్శమును దన హృదయ ఫలకమున దీర్చి దిద్దుకొనుటకై 1953 లో వ్రాసికొని యుండెను. కాని ఆ పరమ పవిత్రమూర్తిని తన దృక్పథమున జిత్రించుకొని, ఆ దివ్యాధ్యాత్మికాదర్శమూర్తిమత్వమున దా నంతర్లీనమై ఏకత్వమునొందు మహాదాదర్శమున అమితోత్సాహమున విషయముల గాలదన్ని, అతి పిన్నవయస్సున నీ యలౌకిక లోకమునకు దుమికిన మన మాతాజీ హృదయముగూడ నీ చిన్న రచనమున ననుస్యూతమై ప్రస్ఫుటమై యొప్పుటచే మాతాజీ శారదామాయిల ఏకత్వపు స్వరూపముగ నీ గ్రంథ మలరారుచుండుటచే మాకెంతయో ఆనందముగలిగి, వీరి పరమ పవిత్రాదర్శములు సంఘమున కెంతయో యుపయుక్తమని విశ్వసించి, ఉత్సహించి 1953న శ్రీ శారదా శతవార్షిక జయంతి సందర్భమున ప్రకటించి యుంటిమి.

మా సంకల్పమున కనుగుణముగ నీ పుస్తకమును పత్రికలు, పండితులు, పామరులు, ఎల్లరును మోదమున స్వీకరించి కొనియాడి యుండిరి. ఈ యపూర్వాదర్శము అనేక సాధక హృదయములలో నూత్నచైతన్యమును రగుల్కొల్పి మార్గదర్శక మగుటయు నాశ్చర్యకరము కాదు.

మరల 'మన శారదామాయి' గ్రంథము పునర్ముద్రణమున ప్రవేశించ, పూర్వ రూపమునగాక, నిసుమంతగ నభివృద్ధి యనవసరమనితోచి పెంచి వ్రాయబడినది. క్రమ పరిణామ మెప్పుడును అభిలషణీయమును, ఆరోగ్యవంతమును గదా! కాలగమనము ననుసరించి అధికతరోపయుక్తముగూడ కావలయునుగదా!

అందుచే నీ 'మన శారదామాయి' యీ నూత్నమును అందమును పవిత్రమును అయిన స్వరూపమున నెల్లర కానందదాయకమై వారి వారి ఆధ్యాత్మిక జీవితములబాసటయై విరాజిల్లుగాక అని ఆశించెదము. అందులకు పరమేశ్వరుడును ఆశీర్వదించి పోషించి పెంచునుగాక!

బాపట్ల
21-8-60

త్యాగస్వరూపిణీం దేవీం త్యాగయోగ సమన్వయామ్।
శోకమోహవిదూరస్థాం శారదాం ప్రణమామ్యహమ్॥



శ్రీ శారదాదేవి



To The Divine Mother

Were I a bit of thread,
I could be woven into your garment
And stay close to you
Were I a piece of leather,
I could be made into sandals
To prctect your beloved feet.
Were I a mango,
You could eat me quickly - what joy !
But alas ! I am not one of these,

Cecille Pomerene,

వొక దారపుప్రోగునై యుండినచో,
నీ వస్త్రమున నల్లబడి యుండగలిగి
నీ కతి సన్నిహితముగ నుండగలను.
వొక చర్మఖండమునై యున్నచో,
పాదరక్షలుగ నేను గాగలిగి
నీ ప్రియ చరణముల రక్షించి యుందును.
వొక మామిడి ఫలమునై యున్నచో,
నీవు నన్ను త్వరగ తినియుందువు - ఎంత ఆనందము !
కాని అకటా ! వీనిలోనొక్కటి నే గాదుగదా !

సిసిలీ పోమరీన్,

ప్రేమార్పణము

నా యాధ్యాత్మిక జీవిత విధానమునకు

కారణభూతయగు

మా

అమ్మ

శ్రీమతి లమ్ము గున్నమ్మగారికి

ఉపోద్ఘాతము

మాతృత్వము లౌకికాలౌకికములని ద్వివిధము, అందు లౌకిక మాతృత్వము తన నల్వురు బిడ్డలకు పరిమితమై యుండ, అలౌకిక మాతృత్వము, సంకుచితదూరమై, విశాలత్వము నొంది విశ్వవ్యాప్తమగును. లౌకిక మాతృత్వమున స్వార్ధము అంతర్గతము. అలౌకిక మాతృత్వమున నిస్స్వార్ధము గోచరము. మరియు అలౌకిక మాతృత్వము సాధనాదులచే లభ్యము. 'నాయమాత్మా బలహీనేన లభ్యః' ఆ యాత్మ బలహీనులకు అనగా సత్సంస్కార హీనులకు లభ్యము కాదనురీతి స్త్రీపురుష తారతమ్యము శ్రుతులలో లేదు. పవిత్ర గురు సన్నిధిని, పవిత్రసాధనలచే పునీతమై, పవిత్ర ఆత్మ జ్ఞానముచే పవిత్రీభూతమైన స్త్రీమూర్తి సర్వ ప్రపంచముచే 'అమ్మ' అని పిలువబడి జగద్వంద్య యగుట అలౌకిక మాతృత్వము నందలి రహస్యము.

పై విధముగ కుగ్రామమున జన్మించిన శ్రీ శారదాదేవి, పంచ వర్ష ప్రాయమున, సర్వసమన్వయమూర్తియు, పరమహంస చక్రవర్తియు, కామకాంచనవిజేతయు నగు శ్రీ రామకృ దేవుని నామమాత్రపు వ్యావహారిక ధర్మపత్నియై, ఆజన్మ బ్రహ్మచారిణియై, అనుభవసంపన్నయై, శ్రీ రామకృష్ణ దేవుని చేతనే సాక్షాత్ జగన్మాతగా అర్చింపబడి, పవిత్ర మాతయై, సామాన్యులచేత నేగాక సన్యాసులచే నేటికిని పూజింపబడుచున్నది. ఆమె దివ్య జనని: నేటి స్త్రీలోకమునకు ఆమె సర్వాదర్శము.

అట్టి మాతృమూర్తి దివ్య జీవిత విశేషముల దెలుపు నీ 'మన శారదామాయి' నేడు ౫వ ముద్రణమును పొందినది. సర్వులు ఆమె నాహ్వానించి, ఆమె దివ్య బోధం నాచరించి, ఆనందించెదముగాక!

ఇట్లు,

స్వా॥ శా॥జ

శా॥ శానం

నాహం తిష్ఠామి కైలాసే వైకుంఠే వా న కర్హిచిత్ ।
వసామి కింతు మద్ జ్ఞాని హృదయాంభోజ మధ్యమే॥

— దేవీ గీత. 5. 18.

ఓం

శ్రీ మాతృదేవ్యై నమః

మన శారదామాయి

ప్రవేశము

శ్లో॥ పవిత్రం చరితం యస్యాః పవిత్రం జీవనం తథా।
పవిత్రతా స్వరూపిణ్యై తస్యై దేవ్యై నమో నమః॥

మన ఆర్ష సంస్కృతి సంకుచితగుణదూరమై, సకల సద్గుణ సుశోభితమై, విశాలమై, సర్వాదర్శకమై, సర్వ వంద్యమై వెలుగొందుచున్నది. ఆ దివ్య సంస్కృతీ పర్యవసాన పారమార్థిక సంపద పరంపరాగతమై, అవతారవరేణ్యుల, జగద్గురువుల, మహాపురుషుల, యోగినీమణుల, బ్రహ్మవాదినుల వెల్లువయై ప్రవహించి, ప్రపంచమును ముంచెత్తినది. అట్టి సర్వ భేద రహితమును, సకల

ద్వంద్వ విదూరమును అగు నా అద్వైతానందామృతమున స్త్రీ పురుష భేదమే లేదు. అందుచేతనే 'త్యాగే నైకే అమృతత్త్వం' ఒక్క త్యాగముచేతనే అమృతత్త్వమని కైవల్యము, 'బ్రహ్మచర్యాదేవ ప్రవ్రజేత్' బ్రహ్మచర్యము నుండియే సన్న్యసింపవలయును, 'యదేహరేవ విరజేత్తదహరేవ ప్రవ్రజేత్' ఎపుడు వైరాగ్యముదయించునో అపుడే సన్న్యాసమును స్వీకరింపవలయునని నారద పరివ్రాజకము, 'తత్పశ్యేత్ అగ్ర్యయా బుద్ధిః సూ యా' సూ మము సునిశితమగు బుద్ధిచే నా బ్రహ్మమును గాంచవలయునని ముండకము మున్నగు నుపనిషత్ వాక్యసంచయమునను, 'అభ్యాసవైరాగ్యాభ్యాం' అభ్యాస వైరాగ్యములచేతను, 'అభ్యాసేన లభ్యః' అభ్యాసముచే లభ్యము అను యోగసూత్ర వాక్యతతియందును, 'సత్వాత్ సంజాయతే జ్ఞానం' సత్వమువలననే జ్ఞానోద్భవమనియు, 'తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా। ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః॥' ఆ జ్ఞానమును సాష్టాంగ నమస్కృతిచేతను, పునః పునః ప్రశ్నించుటచేతను, సేవచేతను కు బ్రహ్మజ్ఞులైన జ్ఞానులు ఉపదేశింపగలరు, గ్రహింపుము అను భగవద్గీతా శ్లోకములందును, బ్రహ్మానందమునాస్వాదనము చేయువారి అధికారి నియమే వ్యక్తమగుచున్నది కాని స్త్రీ పురుష భేద ప్రశంసయే అట నగోచరము. బ్రహ్మమహాత్మ్యానికి వ వివరింపబడిన గుణ

యుక్తులగు స్త్రీలైనను అర్హులనియేగదా తాత్పర్యము. అయినను ప్రత్యేకముగ 'సర్వవర్ణాధికారశ్చ నారీణాం యోగ్య ఏవ చ' సర్వవర్ణాధికారములు స్త్రీలకును యోగ్యములే అని గౌతమీ తంత్ర శాస్త్రమును, 'పురాకల్పే కుమారీణాం మౌంజీ బంధనమిష్యతే। అధ్యాపనం చ వేదానాం సావిత్రీ వచనం తథా॥' పూర్వకాలమున బాలికలు ఉపనయన సంస్కారము నొంది, అరణ్యవాసులగు మహర్షుల సన్నిధానమున బ్రహ్మచర్యము నవలంబించి, సావిత్రీమంత్ర గ్రహణమునకును, వేదాధ్యయనమునకును నధికారులై చెల్వొందియుండిరని యమస్మృతియు, నాధ్యాత్మిక పథమున వనితలకుగల యర్హతను వ్యక్తపరచుచున్నవి. అనగా 'సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ' సచ్చిదానందస్వరూపమును, 'అదృశ్యమవ్యవహార్యమగ్రాహ్యలక్షణమచింత్యమవ్యపదేశ్యమేకాత్మప్రత్యయసారం ప్రపంచోపశమం శాంతం శివం అద్వైతం' అను శ్రుతిరీతి నదృష్టత్వాదియద్వైతపర్యంత ప్రపంచ వ్యతిరేక లక్షణములు గల నా బ్రహ్మ స్వరూపమును, త్యాగప్రధానులై స్త్రీలునైతము పొందనగుననియే శ్రుతి స్మృతి పురాణ తంత్ర శాస్త్రముల తాత్పర్యము. పై శ్రుతి స్మృతి వాక్యానుగుణ్యముగ నారీమతల్లులు వేదాధ్యయనము గావించియు, పండిత సభలందు వేదాంత సింహములపూటిక్కి వాదోపవాదముల నొనర్చియు, 'బ్రహ్మచర్యదీక్ష గైకొనియు, 'స్త్రీణామపి ప్రాగ్వివాహాద్వా

వైధవ్యాదూర్ధ్వం సన్న్యాసేఽధికారోఽస్తీతి దర్శితం। తేన భిక్షాచర్యం మోక్షశాస్త్రశ్రవణం ఏకాంతే ఆత్మధ్యానం చ తాభిరపి కర్తవ్యం। త్రిదండాదికం చ ధార్యం'। వివాహత్పూర్వముకాని, వైధవ్యానంతరముగాని స్త్రీలకును సన్న్యాసాధికారము కలదని దర్శితము. ఆ సన్న్యాస స్వీకరణముచే భిక్షాటనము, మోక్షశాస్త్ర శ్రవణము, ఏకాంతమున నాత్మధ్యానము వారికిని చేయదగినవియే. మరియు త్రిదండాదిక ధారణముగూడ గలదనియే మహాభారతమున మోక్ష ధర్మము వచించురీతి బ్రహ్మచర్యమునుండియే విరాగధనులై సన్న్యాసమును గ్రహించియు, గఠిన తపోనియతిచే మనోపారిశుద్ధతను గడించియు, సమ్మనోగత నిర్మలత్వముచే జరామరణదూరమగు అమృతత్త్వమును, అనగా మోక్షసామ్రాజ్యమును, 'కేవలీ భావః కైవల్యః' అను యోగశాస్త్రమురీతి గైవల్యము బొంది, పరమానందాంబుధి నోలలాడుచూ, ప్రపంచమునకాదర్శులై, నేటికిని పండిత లోకముచే వేనోళ్ళ నుతింపబడుచున్నారు.

వేద, దర్శన, పురాణ, ఇతిహాస కాలములోని కొందరు వనితారత్నముల ప్రతిభలగూర్చి గ్రహింతము గాక! సకల వేదముల నర్థ సహితముగా నధ్యయనము గావించి, తపస్వినియై, బ్రహ్మవాదినియై, జనకుని సభాస్థలి యాజ్ఞవల్క్య మహర్షి సత్తముని నెదుర్కొని వాదించి

వి, అపరవిద్యా స్వరూపిణియైన గార్గి. రెండవది వేద మననమేగాక, సర్వ ప్రపంచమునకాధారమును అగు ఋగ్వేదమున కొన్ని సూక్తములనుగూడ స్వయముగా మంత్ర నిర్మాతయై రచించెను, సన్యాసినియు, విదుషీమణియునైన ఘోష నామక నారీరత్నము. ఆ - వాక్ నామము యువతి ఆరామము ఋగ్వేద మంత్రకర్త. మరియు విశ్వవార యను తపస్విని స్వయముగ యజ్ఞముల నొనరించినట్లు ఋగ్వేదమున గోచరము. అంతియగాక 'గోధా ఘోషా విశ్వవారా అపాలోపనిషత్। బ్రహ్మజాయా జుహూర్నామ అగస్త్యస్య స్వసాదితిః। లోపాముద్రా చ నద్యశ్చ యామీ నారీ చ శాశ్వతీ। శ్రీర్లాక్షా సర్వరాజ్ఞీ వాక్ శ్రద్ధా మేధా చ దక్షిణా। రాత్రిః సూర్యా చ సావిత్రీ బ్రహ్మవాదిన్య ఈరితాః।', గోధా, ఘోషా, విశ్వవార - మొదలగు వారిని బ్రహ్మవాదినులుగా బృహద్దేవత వాకొనినది. బ్రహ్మవాదినులనగా 'ఉపనయనమగ్నీంధనం వేదాధ్యయనం' ఉపనయన, అగ్నికార్య, వేదాధ్యయనశీలురని హారీత ధర్మ సూత్రములు నిర్వచించినవి. పై విధానమున వేదకాలమున యింకెందరుగలరో గదా!

దర్శన కాలమున జూచినచో, షడ్దర్శనములలో న్యాయదర్శన కర్త యగు గౌతమ మహర్షి పుంగవునకు భార్యయే, న్యాయశాస్త్ర ప్రవీణ యగు సుబాల యను

సన్యాసిని ప్రశాంతము మరియు బాల్యమునందే, చంచల మును, యౌవ్వనతుల్యముగ క్షణికమును, నశ్వరమును గు విషయ వాసనల త్యజించి, ఆధ్యాత్మిక స్థితుల నత్యున్నత నిర్వికల్పాది సమాధ్యవస్థల బొంద నిచ్చగించి, కాషాయ ధారియై దీర్ఘ తపోనిష్ఠ జెలంగి, హృదయ పవిత్రతచే బ్రహ్మ గోచర సమాధిసంస్థితుల నార్జించి, తుష్ట మైన ఫల ముఖ విమర్శలును, సంసారపాశ బద్ధులు, పురుష్కృతి ఛాయజాలకే గీటకములవోలె నందుండు ప్రాపం చిక జీవుల దుఃఖనినాదంబులు తన చెవులకు ముట్టగ శోక, విహ్వలయు, దేవమూర్తియును, గోణికా నాప యము నగు నా తపస్విని, ప్రపంచము నుద్ధరింపట కై యేక సమ్మోదవన మ భావించి, 'ప్రాజ్ఞమప్పయ సుతం మః ప్రాజ్ఞుడై సుతుని అనగా సమ్య నిమ్మని మహే శ్వరుని ప్రార్థించి, తపమును తీవ్రతరమొనరించి, ఆ వరప్రసాదముగ బరమేశ్వరుని మెప్పించెను. అంత నీశ్వరా నుగ్రహ పాత్రముగ, నమస్త భూభార నిర్వహణ సమర్థుడగు పుత్రుడు. 'జన్మ తాపసకులే పరిష్ఠ శీలం యా స్పృహా స్పృహ చేయతా తం చ వీక్ష్య తపసా గ్లపి తాంగీం మాతరం' అను పతంజలిచరిత వాక్యము వలె తాపస వంశ ప్రఖ్యాతయు, పరిశుద్ధశీలియు, సాక్షాదీశ్వరి తానే యని సదా భావించునదియు, తపముచే గృశీభూత శరీరయు నగు నా గోణికామూర్తి చి సంతోషస్వాంతుడై తిలకించి,

ఆ యోగిని భాస్కరునకర్ఘ్యప్రదానమొనరింప, జలముల నంజలి గొనియుండ, నందు సూక్ష్మరూపమున ప్రవేశించి, అర్ఘ్యమిడుకాలమున ద్వాదశ వర్షప్రాయ బాలకుడై, అంజలి నుండి పృథ్వీస్థలి నవతరించెను. ఆమెయు నా కుమారుని వీక్షించి సప్రేమముగ కౌగిట చేర్చి, 'అంజలేః పతిత ఇతి పతంజలిః' అను వ్యుత్పత్తి ననుసరించి అంజలినుండి పడుటచే పతంజలి యని యా బాలునకు నామమిడి, ప్రపంచోద్ధరణమునకై తన సకలానుభవకోటిని వివరించి, సాధనానుభవపూర్ణమగు యోగదర్శనమునకు నిర్మాతగా నతని రూపొందించెను, కాశ్మీరదేశమునగల గోనర్ద దేశీయయు, బ్రహ్మవిద్యా స్వరూపిణియు నగు గోణికా నామక తపస్వినీ తిలకము.

మరియు పురాణకాలమున తిలకింప, నొక రాజ చంద్రుని పుత్రియై, పసితనమునందే విషయలంపటముల నంటుకొనక, నరణ్యముల దపమాచరించి, బ్రహ్మానందము నాస్వాదించి, అందు దన్మయురాలై, యోగధర్మానుష్ఠాతయై, 'మహీమనుచచారైకా సులభా నామ భిక్షుకీ' పరివ్రాజికయై, దేశసంచారమొనర్చుచున్న సులభ నాబడు ఒక సన్న్యాసిని, నిష్కామకర్మ రతుడును, రాజయోగియును, సుప్రసిద్ధ సాంఖ్యతత్త్వవేత్త యగు పంచశిఖాచార్యుని శిష్యుడును, మిథిలాపురాధీశ్వరుడును, వేదాంతియు

నగు జనకునితో 'క్షైక్ష్యపర్యాపదేశేన' శిక్షితుని నెపమున వర్ణించి. దర్శించి, ఆ రాజవరేణ్యునిచే బూజా సత్కారముల నొందినట్లు మహాభారతగ్రంథ కథనము. ఇట్లే యసంఖ్యాక స్త్రీసన్యాసులు, ప్రాచీనకాలమున మన భారతదేశమున వర్తిల్లిరి.

ఋషభునిచే స్థాపితమగు జైనమతమునగూడ, స్త్రీ సన్యాసి స్వీకారము గానవచ్చుచున్నది. ఆ స్త్రీసన్యాసినులను బరివ్రాజికలనెడివారు. వర్ధమాన మహావీరుని కాలమున జైనమతము మిక్కిలి అభివృద్ధి గాంచి, మహావీరుని శిష్యులలో పరివ్రాజికలు 36000 ఉండినట్లుగ చరిత్ర.

పై వచింపబడినట్లు జైనమతమున మాత్రమేకాక, లోక బాధల గాంచి, హృదయము చలింప, శాశ్వతానందమును తాము పొంది, ఆ యానందమున సర్వమానవాళి మంప దీక్షగొని, అద్దానికై విశాల సామ్రాజ్యమును, ముదుసలి జనకుని, నవయౌవనవతి యగు భార్యను, పసి బిడ్డను, సమస్త సుఖములను బరిత్యజించి, 'సంగం త్యక్త్వా సుఖం వ్రజేత్' సంగమును త్యజించి, సుఖమును బొందవలయునను ఆర్యోక్తి విధాన సర్వసంగముల ద్రోసి, అరణ్యముల వసించి, ఆహార నిద్రాదుల విస్మరించి, తీవ్ర

తపస్సు గావించి, బుద్ధత్వమును సాధించి, అహింసా జ్యోతిని వెలిగించిన బుద్ధభగవానుని బౌద్ధమతమునను అనేకమంది స్త్రీసన్న్యాసినులు గోచరము. వీరు భిక్షుణీ లనబడుదురు. మగధరాజు బింబిసారుని ధర్మపత్నియై, బుద్ధభగవానుని ముఖతః సాంసారిక దుఃఖముల శ్రవణము చేసి, హృదయము పరివర్తనము చెంది విరాగ మంకు రింప, భర్త యనుజ్ఞ గొని, సన్న్యాస స్వీకరణమొన రించి, బుద్ధ నాశ్రయించి, బౌద్ధధర్మ పాలనము జేయుచు, బుని అగ్ర శ్రావికలలో ప్రముఖ స్థానము వహించి, బుద్ధుని దక్షిణమున నాసీన యగు నర్హత బొంది, 'దక్షిణ హస్త శ్రావికగా' క్షేమ యను మహారాజ్ఞి ప్రఖ్యాతి నొం దెను. అట్లే శ్రావంతీ నగరమున, నొక ధనికునికి అతి సౌందర్యవతి యగు ఏకైక పుత్రికగా జన్మించి; ఆ సౌంద ర్యమును దిలకించి రాజాధిరాజులు ఆమెను వివాహమాడ ఆమె జనకుని చెంతకరుదెంచుటయు, ఒకని కిచ్చి వివా హము జేయ దదితరులు పోరాటముల ప్రసగ్గుదురని ఆమె తండ్రి దీర్ఘముగ యోచించి, బౌద్ధ సంఘమున జేరి విషయముల నతీతింప నామెకాజ్ఞ నిడుటయు, నంత నామె బుద్ధుని శరణు జొచ్చి, బౌద్ధమత ధర్మముల సక్రమలీల నాచరించి, అగ్రశ్రావికయై, బుద్ధుని వామ పార్శ్వమున నాసీన యగు అధికారము నొంది, 'వామహస్త శ్రావిక'యై వెల్గొంది, తపస్సు గావించుకొనుచు, భిక్షాటనము జేయుచు

సుప్రఖ్యాతినై వెలుగొందినది ఉత్పలవర్ణ యను నొక వనితారత్నము. మరియు, నొక కోటీశ్వరుని ధర్మ పత్నియై, ఏకైక పుత్రుని మరణవేదనను భరింపజాలక బుద్ధుని జేర, బిడ్డను బ్రతికింపుమని ప్రార్థించెను. కాని మరణించినవారు తిరిగి జీవింతురా? అయినను భగవానుడు సర్వ ప్రపంచము నశ్వరమే యని బోధించు నుద్దేశమున నామెను వీక్షించి, 'అమ్మా, దుఃఖవిదూరమగు స్థలమున జేరెడు తిలల గొని రమ్ము. వానిచే నీ బిడ్డను సజీవునిగ జేయగల' నని పలికి ఆమెను వెనుకకు బంపెను. ఆమెయు వల్లె యని ప్రతిగృహమున నీ విషయమును తెల్పుచు, వారిచే సర్వము దుఃఖమయముగా గ్రహించి, సర్వ మమ కారముల ద్రుంచి, 'ప్రేమతో జాయతీ శోకో ప్రేమతో జాయతే భయం। ప్రేమతో విప్రముక్తస్స నత్ధి శోకో కుతో భయం॥' ప్రేమమండియే శోక భయములుత్పన్న ములు. ప్రేమమండి విముక్తుడగువానికి శోకములేదు. ఇక భయమెచ్చట? అను శ్రీ బుద్ధదేవుని ఉపదేశసారమున హృదయమున బదిలపరచి, బౌద్ధమతావలంబినియై, భిక్షు ణియై, తనరినది కిసాగౌతమి యను నారీమణి. ఇంకను ఎందరో స్త్రీలిట్లు బౌద్ధమతమున నలరారియుండిరి.

ఈ విధమున ప్రాచీన కాలమునమాత్రమేగాక ఆధు నిక కాలమునగూడ దమ దీక్షాశక్తిచేనేమి, తమ పవిత్ర తేజో

పుంజముచేసెను, పెక్కండ్రు వనితామణులు సమస్త ప్రపంచమును ప్రకాశితమొనర్చుట విదితము. 'తన్యతే విస్తార్యతే అనేనేతి తంత్రం' రక్షించు జ్ఞానమును వ్యాపింప జేయునది తంత్రము అను వ్యుత్పత్తి విధానమున, నట్టి అరువదినాలుగు తంత్ర శాస్త్రముల సారమును గ్రహించి, సాధించి, అనుభవించి, దానిని లోకమున జాటుటకు సర్వ శక్తి యగు కాళికాదేవి యాజ్ఞను గొని, సర్వ ప్రదేశముల గ్రుమ్మరుచు, దక్షిణేశ్వరమున కేతెంచి, బ్రహ్మచర్యవ్రత నిష్ఠాగరిష్ఠుండును, లోకమాన్యుండును, జితేంద్రియుం డును, పరమహంస చక్రవర్తియు, గామకాంచనాతీతుం డును, అగు శ్రీ రామకృష్ణ దేవునకుపదేష్టయై, తంత్రార్థ ముల బోధించి, వైష్ణవచరణ గౌరీపండితాది మహావిద్వాం సులుగల సభారంగముల, శ్రీరామకృష్ణుడవతారశ్రేష్ఠుడని ఎల్గెత్తి చాటి, వేదాంత పతాక నెగురవైచినది యోగినియు, వర్చస్వినియు నగు భైరవీబ్రాహ్మణీ గిరి. మరియు శిబ్ పూర్ నివాసి యగు ఛటోపాధ్యాయ, గిరిబాలల గర్భవాస మున జన్మించి, సకల కళాయుక్తుడగు శ్రీకృష్ణభగవాని ఇష్టదైవముగ నెంచిన మృడాని యను బాలిక, పసితనము నుండియే అంతరమున అవ్యక్త సంస్కారములు మొలక లెత్త, 'అధ్యాత్మవిద్యా విద్యానాం' అను గీతోక్తి విధాన అధ్యాత్మిక విద్యను ఉత్తమముగా బరిగణించి, త్యాగమభి వృద్ధి చెంద, ద్వాదశవర్ష ప్రాయమున వివాహము నొల్లక,

'విషిణ్వంతి బధ్నంతీంద్రియాణీతి విషయాః' ఇంద్రియములు బంధించునవి విషయములు అనురీతి 'విషసర్పంబుల గౌగిలించలిదే' యనునట్లు విషయసుఖములకాశింపక, శాశ్వతానందమున విహరింపగోరి, గృహము బాసి, యరణ్యముల గ్రుమ్మరి, తపంబొనర్చి, సన్న్యాసాశ్రమము స్వీకరించి, సర్వశక్తి స్వరూపిణి యగు పార్వతీదేవి శక్తి సామర్థ్యముల గ్రహించినదో యనునట్లు 'గౌరీమాయి' యను నాత్మ నామమును అలంకరించి, యిరువదియైదవ వత్సరప్రాయమున శ్రీరామకృష్ణ నాశ్రయించి, శ్రీశారదామాయి సన్నిధానమున వసించియుండుచు, శ్రీ శారదామాయినే యాదర్శముగ స్వీకరించి, యామె పేర 'శ్రీశారదేశ్వరీ ఆశ్రమము' అను నొక స్త్రీల మఠమును కలకత్తా నగరమున స్థాపించి, అందు అనేక స్త్రీలకు విద్యాశిక్షణముల నొసంగి, సన్న్యాసమును సైతము నిడుచు, స్త్రీయధికారమును ఆమె లోకమునకు వెల్లడించెను. ఆశ్రమ స్థాపనమే కాక, ఆమె దేశముల బర్యటించుచు, ఉపన్యాసముల నొసంగుచు, సుప్రఖ్యాతి గడించినది.

ఆమె ధైర్యస్థైర్యములకును, త్యాగమునకును, పవిత్రతకును మెచ్చి, ఆనందించిన శ్రీరామకృష్ణ పరమహంస దేవుడు, తాను ఏ భక్తుని గృహమునకు వెడలినను తన వెంట శ్రీ గౌరీమాయిని దోడ్కొని అరుగుచుండెడి

వాడు, అంతియగాక 'గౌరీమాయి యీ విధముగా వచించిన' దని, ఆమె వాక్యముల దన ప్రసంగముల ప్రమాణయుక్తములుగ నుదహరించువాడు. ఆమెనుగూర్చి If a woman becomes a Sanyasini she is no longer remains a woman ఒక స్త్రీ సన్న్యాసిని యైనచో, ఆమె స్త్రీవ్యక్తి కాదని సగర్వముగ బలికెడివాడు. శ్రీ శారదామాయియు గౌరీమాయి నత్యధికముగ ప్రేమించుచు, ఆమె ఒనర్చు పర్వకార్యములకు సలహాల నొసంగుచు, సన్న్యాసమును గూర్చిన ప్రసంగమున 'గౌర్దాసిని ఉదాహరణముగ గ్రహింతము. ఆమె స్త్రీయా? ఆమె పురుషుడు. ఆమెనుబోలు పురుషులెందరుగలరు?' అని గౌరీమాయినిగూర్చి పల్కుచు నానందించెడిది, పై వచించిన చందము శ్రీ శారదారామకృష్ణు లిర్వురిచే నంత ప్రేమింపబడి, వారి యాశీస్సుల నందిన ఆ ధన్యజీవి గౌరీమాయి నిజముగా ధన్యయే. Sanyasi is a world teacher సన్న్యాసి జగద్గురువు అను శ్రీ రామకృష్ణ వచనరీతి ఆమె స్త్రీ యయ్యును జగద్గురు స్థానము నలంకరింప సర్వ సమర్థయై వెలుగొందెను.

ఇంతియగాక, పూర్వము వచించినచందము యోగినులకే ఆదర్శయై, శ్రీ రామకృష్ణ దేవుని వ్యావహారిక సహధర్మచారిణియై, ప్రేమ స్వరూపిణియై, ఆధ్యాత్మిక గగనమున విహరించుటకు స్త్రీ యోగ్యతను ప్రదర్శించి యాదర్శ

మూర్తియై, సర్వాధ్యాత్మికానుభవములకు పవిత్రతయే మూలమని చాటుచు, సర్వసద్గుణ విగ్రహానుభవముల బొంది, సర్వ లోకప్రపూజ్యయై వెలసింది, 'పవిత్రం చరితం యస్యాః పవిత్రం జీవనం తథా। పవిత్రతాస్వరూపిణ్యై తస్యై దేవ్యై నమో నమః॥' అనురీతి పవిత్ర చరితము వనే గాక, పవిత్ర జీవనమునను నాదర్శయై, మరియు పవిత్ర స్వరూపిణియునై వెలసింది, గృహస్థులకును సన్యాసులకును పరమాదర్శయై యొప్పారు శ్రీ శారదా మాతాదేవి నేటి ప్రపంచమున సర్వులకు వందనీయయై విరాజిల్లుచున్నదిగదా। ఎట్టి జీవిత మహిమచే నీమె సర్వా దర్శమైనదో, దర్శన స్పర్శన వచన భావనములచే పవిత్ర ప్రేమమున నెట్లు ఈమె సర్వహృదయ పరివర్తనమొన రించెనో, కూపస్థ 'మండూకములమాదిరి ప్రపంచమున సర్వాహంకార మమకార బద్ధులయ్యును మోక్షమును కాంక్షించు ముముక్షుకోటికెట్టి యుపదేశరత్నముల నొసంగెనో యికముందు గ్రహించెదముగాక।

అవతరణము

'పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే॥' సాధు రక్షణము, దుష్ట శిక్షణములకొరకును, ధర్మసంస్థాపనార్థమున్ను

నేను ప్రతియుగమునందును జనించుచుందునను గీతాకారు డగు శ్రీకృష్ణ పరమాత్మ వచన సరణి రామ, కృష్ణ, బుద్ధ, శంకర, చైతన్యాద్యవతారములు పెక్కు స్పష్టము. కాని 'అపకారిషు యః సాధుః స సాధుః సద్భిరుచ్యతే!' అపకారము గావించువారియందు ఎవడు మేలు నొనరించునో వాడు సత్పురుషుడని సత్పురుషులచే వచింపబడినట్లు శ్రీ శారదాదేవి అవతారముమాత్రము సాధురక్షణమేగాక దుష్టరక్షణముగూడ సేయు తలంపుతో నావిర్భూతము. హంత కుడైనను లేక కేవల పాతకుడైనను, ఎట్టి దుష్టవర్తను డైనను, తనచెంతకు జేరినతోడనే మాతృప్రేమకు మించిన యనురాగముతో దరికి జేర్చి, తన యనుంగు బిడ్డలగు శిష్యులతో సమముగ జూచునుగదా! అందుచే దుర్మార్గులని ప్రపంచమున వక్కాణింపబడుచున్న వ్యక్తులు గూడ సర్పము మంత్రగానికి వశమగు రీతి, నామె పవిత్ర సన్నిధానమున నా స్వార్థరహిత నిష్కళంక ప్రేమకు దాసానుదాసులై, యావజ్జీవము నామె పాదపద్మముల విడువ వాల్లక, ఆ పరమాదర్శక జీవితవిధానముల దాముగూడ నాచరించి, సత్పురుషులై చెలంగిరి యన నెయ్యది అద్భుతము, అపూర్వమునై యున్నదిగదా! ఆమెయొక్క అనంత అఖండ ప్రేమ మూర్తులనుగూడ నెట్లు మార్చెనో ముందు చూపెదనుగాక! ఇట్టి అపూర్వ, ఆదర్శ ప్రేమ

స్వరూపిణి యామెయే యనిన, నిక నామెను గన్న మాతా పితలు పెట్టివారలోగదా! అప్పను, తల్లిదండ్రులు పుట్టియేగదా బిడ్డల బుద్ధి ప్రవృత్తులు! కాన నామె వంశమును తల్లిదండ్రుల విషయముగూడ గ్రహించ నవసరమేగదా! రాముని గనిన కౌసల్యయు, కృష్ణుని తల్లి యగు యశోదయు, రామకృష్ణుని గనిన చంద్రామణియు, వివేకానందుని గనిన భువనేశ్వరియు, సర్వ ప్రపంచము నుద్ధరించు మహ వ్యక్తుల నొసంగి, తమ జీవితముల ధన్యమొనరించుకొనుటయేగాక. సకల మానవకోటియొక్క ముక్తికి సహాయభూతులై, తమ నామధేయముల నాచంద్రతారార్కముగ ప్రకాశింపజేసికొనిరి. అట్లే భగవంతుని మాతృప్రేమ మూర్తిని దాల్చి, సర్వులచే పవిత్ర మాతృదేవి యని పిలువబడుచు, శ్రీ శారదామణీదేవి యని వ్యవహరింపబడుచున్న యీ జగ జ్జనని గనిన తల్లిదండ్రుల భాగ్యమే మహ భాగ్యముగదా! వారు ముమ్మాటికీ ధన్యులు! ధన్యులు! ధన్యాతిధన్యులు! అట్టి వారిచే 'కులం పవిత్రం జననీ కృతార్థా వసుంధరా పుణ్యవతీ చ' వంశము పవిత్రమై, తల్లి కృతార్థయై, భూదేవి పుణ్యవతి యగుచునున్నట్లు మన శారదాదేవిచే సర్వము పునీతమై యొప్పినది.

భారతావనిలో ప్రథమ నగరమని పరిగణింపబడి, కాళీఘట్టమనియు గలకత్త యనియు నాబడు నగరమునకు,

పశ్చిమదిశకు అరువదిమైళ్ళ దూరముననున్న జయరామవటి యను నొక కుగ్రామమే శ్రీ శారదాదేవి జన్మభూమి. నాడు ప్రయాణ సౌకర్యములకు దూరమైనను, నేడు ఏ కొలది సౌకర్యముల గల్గియున్నను 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' జననీ జన్మభూములు స్వర్గముకంటె నధికము అను సూక్తివిధాన, నీ జయరామవటి నాబడు గ్రామమే శారదాదేవి జన్మస్థానమగుటచే, నేడు క్షేత్రరాజమై యాత్రికులకు కేంద్రస్థానమై యలరారుచున్నది. ఆమె ఖ్యాతి ప్రపంచ వ్యాప్తి నొందుటయే దీనికి గారణము విదితము. మరియు, పవిత్రతచేతనే యెట్టి విరోధములు లేక యాధ్యాత్మిక గమ్యమగు మోక్షసామ్రాజ్యము నధిష్ఠింప వలయునను శ్రీ మాతృదేవి యుపదేశమును సూచించు చున్నదో యనునట్లు అమొదార్ యను నది స్వచ్ఛమై, నిర్మలమై, నీ గ్రామమునకు ఉత్తరదిశగా బ్రవహించు చున్నది. అట్టి పవిత్ర నదీతలమునగల యీ గ్రామమున, రెండు బ్రాహ్మణ కుటుంబములలో నొకటి యగు ముఖోపాధ్యాయ కుటుంబమున శ్రీ శారదామణి జనించెను. ధర్మ రతుడును, దానశీలుడును, సత్యపథానువర్తియు, మహా భక్తుడును, నిష్కపటియునగు రామచంద్ర ముఖోపాధ్యాయ యను ఆర్యునకును, పవిత్రశీలయు, పతిభక్తి యుక్తయు, కపటదూరయు, సర్వుల దన నిష్కళంక ప్రేమచే బ్రహూతమొనరించునదియునగు శ్యామసుందరీదే

యను కాంతా తిలకమునకు నామె జన్మించెను. కాలక్రమ మున శ్రీ శారదామాయియొక్క శిష్యకోటిలో నెవ్వరైన తన వద్దకు నేతెంచినచో ఆ వృద్ధ శ్యామసుందరి, తన కన్నబిడ్డలమాడ్కి వారి నాదరించెడిదట. ఆమెనుండియే ఆ ప్రేమవాహిని మన శారదాదేవియందు ప్రవేశించి, అధిక తర విశాలమై, సర్వప్రపంచము నావరించినది యని విది తము.

ఇక శ్రీ శారదా జననవిషయముగూడ సత్యాద్భు తము. శ్యామసుందరి యొకపర్యాయము సమీప గ్రామ మగు శిహోరికి సత్సవసందర్భమున వెడలి, యట దేవా లయ సమీపమున నొక వృక్షచ్ఛాయ నాసీనయై యుండెను. ఆ సమయమున, నామెకు రక్త వర్ణ వస్త్రములు ధరించి, వైడూర్య పత్సరముల రూపసి యగు బాలిక యొకర్తె కను పించి, తన మృణాళనాళికలబోలు కోమల హస్తద్వయ ముచే సుందరీ కంఠమును గాఢాలింగమున జేర్చి, ముద్దు మాటలగట్టు మృదుమధుర వాక్యములతో 'అమ్మా! నేను నీ గృహమునకరుదెంచితిని' యని పల్కుచు నామె శరీరమున ప్రవేశించెను. అంత శ్యామసుందరియు స్పృహ దప్పి పడై, కొంతకాలమునకు దెప్పరిల్లి ఆశ్చర్యము నొందెను. ఈ సంఘటనము జరిగిన క్రీస్తుశ 1853 వ సంవత్సరము డిశంబరు యిరువది రెండవ తేది యనగా ప్రమాదేవ నాప

సంవత్సర, మార్గశిర బహుళ సప్తమీ గురువారమున శ్రీ శారదామాయి జనించి, వారి గృహమును, సర్వ ప్రపంచమును బునీతమొనరించెను.

ఇట్లు, కేవల కారణ జన్మమును నొందిన మన శారదాదేవి, పసితనమాదిగ దన దేవత్వమును దరచు వ్యక్తము గావించుచు, నా జయరామవటీ గ్రామమున నెల్లరకల్లారుముద్దుబిడ్డగా చనరి, దినదిన ప్రవర్ధమాన యగుచుండెను. ఈమె చిన్ననాటినుండి దేవతామూర్తులగు కాళి, లక్ష్మి, సరస్వతీ మున్నగు దైవముల బూజించుచుండెడిది. భావికాలమున సర్వులకు మాతృమూర్తి కానున్న మన శారదయందు ఆ మాతృత్వశక్తి అంతర్గతమై, ఆ యా సమయముల వ్యక్తమగుచుండెడిది. కాన ఆటపాటలందును, ఆమె తల్లిగ వ్యవహరించెడిది. అవును, కుసుమ సౌరభము మొగ్గయందును అంతర్గతమై, వికసిత పుష్పమున నది అధికమైనటుల నా జగన్మాతృత్వము బాల్యముననే మన శారదయందు అవ్యక్తమై, క్రమముగ నది వెల్లడి అగుటయందాశ్చర్యమేమి? అందువలన నొక పర్యాయమొక శిష్యుడు శ్రీ శారదాదేవితో సంభాషించుచు 'అమ్మా! మిమ్ములను నేను 'అమ్మా' యని సంబోధించుచుంటిని కదా! నిజముగ మీరు నాకు తల్లియా' అని ప్రశ్నింప, చిరునవ్వు ముఖమున నర్తనము సల్పి

మాతృత్వమువొప్పంగ, సర్వ చరాచరభూతకోటికి మాతృ
దేవతయై, చెల్వొందు నా శారదాదేవి పసిబిడ్డను బుజ్జగించు
కన్నతల్లివోలె ప్రేమతో 'అవును, నేను నీ స్వంత తల్లినే'
అని యథార్థమును వ్యక్తము జేయుచున్నదో అనునట్లు
సమాధానమొసంగెను. అది సహజమేగదా! జన్మ పరంపర
లలో మునుగుచు, అనేక తల్లులను గాంచుచు, వారలే
యథార్థమగు తల్లులుగా భ్రమించువారికి యథార్థమగు జగ
న్మాతను గ్రహించుట దుస్సాధ్యముగదా! సర్వదేవతలును
తన కళాస్వరూపులే యైనను 'యద్యదాచరతి శ్రేష్ఠస్త
దేవేతరో జనః। స యత్ప్రమాణం కురుతే లోకస్తదను
వర్తతే॥' అని గీతావాక్యము బోధించునట్లు, ఉత్తమం
యాదర్శములే లోకమునకు ఆచరణీయములు కాన తాను
అర్చనావిధానమును జూపుచుండెడిది, మరియు జగద్ధాత్రి
పూజాదినములలో నొక్కనాడీ బాలిక తన్మయత్వమున
నిశ్చలత మునిగి యానందించెను, లోకమాత యగు నీ
బాలిక తనయందనుభూతమగు సమాధుల గొలదిగ నాడే
లీలామాత్రముగ నాటి వారికి గోచరింపజేసెనేమో!

పరిణయము

ఇక శారదాదేవి విషయము నిట కొంచెము నిలిపి,
శ్రీ శారదామాయిని యుత్కృష్టస్థితిని బొందింపజేసియు,

నీమె యాదర్శముల గ్రహించి తదనుగుణ శిక్షణ మొనరిం
చియు, నఖిల జగత్తునకు బవిత్ర మాతృరూపిణిగ నీమెను
రూపొందింపజేసియు, వ్యావహారికముగ భర్తయయ్యు
భార్యను తన మాతృదేవిగ, నపరదేవతాస్వరూపిణిగ నవలో
కించి, 'త్యక్త్వాతిదూరం కనకం చ కామినీం రరాజయో సా
వకలంకచంద్రవత్' ఎవడు కామకాంచనముల నతి దూరీ
కృతము గావించి, నిష్కళంక చంద్రునివలె ప్రకాశించెనో
యా చందమున కామకాంచనవిజయుడగు శ్రీ రామకృష్ణ
దేవునిగూర్చి యిసుమంత నిక గ్రహింపవలయును.

జయరామవటికి నాలుగుమైళ్ళ సమీపముననే కమార్పు
కూరమ గ్రామమున, క్షుదీరామ ఛటోపాధ్యాయ చంద్రా
మణీదేవి యను పుణ్య బ్రాహ్మణ దంపతులుండిరి. ఏత
ద్వంశభూషణుడగు పుత్రునిగ, 1836 వ సంవత్సరమున
రామకృ దేవుడు జన్మించి, పొట్టకూటి విద్యలకాశింపక,
నపర విద్యను త్యజించి, 'ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞానం భవతి'
ఒక్క విజ్ఞానముచే సర్వ విజ్ఞానములు ప్రాప్తించునను
శ్రుతిరీతి బరావిద్యను బొంద నభిలషించి, 'తేన త్యక్తేన'
త్యాగముచేతనే నా పరావిద్య యగు బ్రహ్మవిద్య సాధ్య
మనియు, మరియు నది 'న కర్మణా న ప్రజయా ధనేన
త్యాగే నైకే—' అను శ్రుతిచందము కర్మ, సంతాన, ధన
ములగాక, ఒక్క త్యాగముచేతనే సాధ్యమనియు

గ్రహించి,, 'తపస్సంచయ ఏవాసౌ విశిష్టో ద్రవ్య సంచయాత్' ద్రవ్య సముదాయముకంటె తపోసంచయమే విశిష్టమనియు నిర్ణయించి, కలకత్తాకు నాలుగు మైళ్ళ దూరమున, రాణీరాస్మణీ యను నారీరత్నముచే నిర్మింపబడిన, సర్వ సృష్టి స్థితి లయ కర్త్రి యగు శ్రీ కాళికాదేవి యాలయమున నర్చకపదవిని స్వీకరించి, అనవరతము నా దేవి నలంకరించుచు, నర్చించుచు, గీర్తించుచు, ధ్యానించుచు, దర్శనాకాంక్ష దపించుచు, 'నిస్పృహస్య తృణం జగత్' అను విధంబున ప్రపంచమును అల్పముగ వీక్షించుచు, అహర్నిశల తపో నిమగ్నత మైమరచుచు, దేవీ దర్శనభాగ్యమునకై తల్లిబాసిన పసివానిచందమున విలపించుచు శ్రీ రామకృష్ణ దేవుడు దన యిరువది నాల్గవయేట దక్షిణేశ్వరమున నుండెను. తన కొమరునకు బిచ్చిపట్టినదని చంద్రామణీ దేవి మాతృ హృదయము పరితపించినదై, వివాహము గావించిన వెర్రి నశించునని నిశ్చయించెను. ఆహా! అమ్మ తెలియుదా యీ విషయము! 'బాలోన్మత్త పిశాచవత్' అను నట్లు మహాపురుషులు, బాలురు, ఉన్మత్తులు, పిశాచములవలె సంచరించుచుందురుగాన, అట్టిస్థితినుండి లోకమునకు వెర్రియావేశ నా పిచ్చి రామకృష్ణుడే, యికముందు ప్రపంచమున సర్వ మానవులకు బిచ్చిని గుదుర్చు భవరోగనాశక భిషగ్వరుడని యా పిచ్చి మాతృదేవి యగు చంద్రామణీదేవి కేమెఱుక! అపుడు, పుత్ర మమకారముచే నట్టి యద్భుత

లీలల యశోదయు, కౌసల్యయు నేమి గ్రహించియుండిరో, అంతియ చంద్రామణియు గ్రహించినది. అట్లు చంద్రామణి కుమారునకు వివాహము సేయగోర 'న మాతుః పర దైవతం' తల్లికంటె నన్యదైవము లేదనియు, 'మాతృ దేవో భవ' జనని దేవతయే యగుననియు, 'మాతాగరీయసీ' మాతృదేవియే ఎల్లరకంటె గొప్పదనియు, సమస్త స్త్రీలోక మును మాతృరూపముగ జూచు రామకృష్ణుడు తన తల్లి యాజ్ఞనుమీరక, జయరామవటిలో దనకై నిర్ణీతమైన కన్యక రామచంద్ర ముఖోపాధ్యాయునింట గలదనియు, విచారింపు డనియు దెలిపెను. ఆ విధముగ వారు విచారించి, ప్రపంచ మననేమియో, వివాహమననేమియో యెరుగని అయిదేండ్ల పసిబాలికయగు మన శారదామణిని రామకృష్ణునకు వివాహము గావించిరి. వరునకు ఇరువదినాలుగు వత్సరములు, వధువునకు నైదు వత్సరములు. ఆశ్చర్యము! అపూర్వము! ఎటనుండి యరుదెంచె నీ సమాగమము!

దీనికి పూర్వమొక సంఘటనము గలదు. శ్రీ శారదా దేవికి మూడేండ్ల ప్రాయమున, సమీపమున గల శిహోడ గ్రామమునకు దేవతాయుత్సవ సందర్భమున శ్యామసుందరి వెడలియుండెను. అచట నామె బాలశారదను అంకమున నిడుకొని కూర్చుండియుండ, చుట్టునున్న స్త్రీలు పరిహాసము నకు మార్గమున బోవుచుండు బాటసారుల నొకొక్కర

శారదకు జూపుచు 'శారదా! ఇతనిని పెండ్లియాడె దవా? ఆ ముసలివాని చేసికొనెదవా' అని ప్రశ్నించుచుండు చియు, నా బాలిక అంతవరకు జూపిన వారి నెవ్వరిన వరిం పనవి తలయూపుచుండ, నదేసమయమున శ్రీరామకృష్ణుడు పూర్వము వచించినరీతి, దక్షిణేశ్వరీ దర్శనాసక్తుడుగాన ధూళిధూసరిత శరీరుడై, బాహ్యదృష్టిలేక నా మార్గమున బోవుచుండ, పరల నా స్త్రీలు అతనిని జూపి' శారదా! ఆ బోవుచున్న పిచ్చివాని బెండ్లియాడెదవా?' యని ప్రశ్నింప, నా బాలికయు చూచి, సమ్మతిని సూచించుచు శిరము మూపెను. అంత వారందరు, 'పిచ్చివానిని మన శారద పెండ్లియాడునట' యని నవ్వుచు వెడలిపోయిరి. వారా విచిత్ర సంఘటనను మరచిరిగాని, యా యిరువురి యపూర్వ వ్యక్తుల మనోభావము లేమియో ఎవరికెరుక?

ఇట్లు బాల్యమున వివాహిత యగు శారదాదేవికి, వసతులులేని యా పల్లెటూరిలో విద్య పట్టుబడలేదు. కాని, సర్వ విద్యాధిష్ఠానమును, బ్రహ్మవిద్యయునగు పరావిద్య ఆమెకు గరతలామలకమగుటచే నామె యా విద్య నభ్యసింప నిచ్ఛగింపలేదేమో! మరియు 'బ్రహ్మవిద్యయా సర్వం భవిష్యంతో మనుష్యా మన్యంతే' బ్రహ్మవిద్యచే సర్వము లభ్యముగ మానవులు తలంచుచున్నారనియేగదా బృహదా రణ్యక వాక్యము! అయినను కొలదిగ జదువనేర్చెనదిగాని,

ఆమె వ్రాయ నేర్వలేదు. ఒక పర్యాయము శ్రీ వివేకానందుని ఆంగ్ల శిష్యురాలైన సోదరి నివేదిత, శ్రీ శారదా దేవి వంతకమును దన పూజామందిరమందుంచి పూజింప గోరి, వంతకమునకై ప్రార్థింప, శారదయు దనకు వ్రాత యలవాటులేమిని దెల్పినను నివేదిత సమ్మతింపనందున, నామె యక్షరముల బలుకుచు వ్రాయ యత్నించెనుగాని ఆ శ్రమ వ్యర్థమయ్యెను. అవును. భగవత్సాక్షాత్కార ప్రాప్తికి వేదాధ్యయనము, శాస్త్రపఠనము, కావ్యరచనములనావశ్యకములు. భగవదనుభూతికి హృదయ పరిశుద్ధతయే ప్రధానముగదా! అందుచేత 'ఓ భగవంతుడా! నీవు నాకు దర్శనమిమ్ము' అని యెంతకాలము ఆర్తిలేక నుచ్చరింతుమో, అంతకాలము భగవంతుడగోచరము. హృదయమునుండియే ఆ వచనము లెప్పుడు వెలువడునో నాడే ముక్తి సాధ్యము అని, ఏసుక్రీస్తు హృదయ ప్రాధాన్యమును స్పష్టీకరించెను. ఈ హృదయాధిక్యతనే సూచించుచు, 'బాహ్యాచారములగాని, అపక్వాహారములగాని, వనవాసమునగాని, కేవలము దుగ్ధపానముచేగాని, తృణ భక్షణముచేగాని, స్త్రీ త్యాగమువలన గాని జీవితమును గడుపుచున్నను, నీ హృదయపరివర్తనము కలుగనిచో నీకు భగవదానందమెట్లు సంప్రాప్తము' అని శ్రీకృ తన్మయత్వమున దన కోకిలస్వర గానముతో వెగ్గెత్తి పాడినది భక్త మీరాబాయి. 'ఓ ముముక్షువులారా! హృదయ పరివర్తనము గలిగినగాని పవిత్రతలేదు.

హృదయ నిర్మలత్వమున్నగాని కైవల్యప్రాప్తి దుర్లభము. కాన సాధ్యాత్మికానందవిహార సౌధమునకు బునాది యగు పవిత్రతను ప్రథమమున నలవరచుకొనిన సర్వము సాధ్యమే' యని పవిత్రతను ప్రధానముగ నుపదేశింపబోవు శ్రీ శారదాదేవికి యీ విద్యలనవసరమని దోచెనేమో! అట్లని ఆమె విద్యను ద్వేషించి, తన సన్నిధిగలవారిని విద్య నభ్యసింపవలదని ఆదేశించెనని భావింతురేమో! కాని యామె యట్లొనరింపక 'శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం' శాస్త్రజ్ఞానము బ్రహ్మనిష్ఠయు రెండును అవసరమని వారికి బోధించి, వారి విద్యాభ్యాసమునకెంతయో ప్రాధాన్యము నొసంగియున్నది. అవును, స్వార్థరహితులు శిష్యుల శ్రేయోభివృద్ధినే కాంక్షించి, వారి యున్నతికై పాటుపడుదురుకదా!

సద్గురు చరణసన్నిధి

కాలవాహినిలో ఎన్నడు ఒకే చందమున నుండదుగదా! అట్లు కొన్ని వత్సరములు తెలియకయే గడచినవి. శ్రీ శారదాదేవి జీవితములో గొన్ని సంవత్సరములు కాలాంతర్గతములై, చక్రమందలి యాకులవలె దొర్లిపోయినవి. ఆమె సుమారు షోడశ వర్ష ప్రాయమై చెలంగెను! ఆమె తన గృహమున క్షణము బోనీయక, నెల్లవేళ

నెదియొ యొక పనియందు నిమగ్నయై, శ్రీ రామకృష్ణ పరమహంస దేవుని యాహ్వానమునకై యెదురు చూచుచుం డెను, కాని యామె కంటబడినవెంట, 'అయ్యో! శారద భర్త పిచ్చివాడై, దక్షిణేశ్వరమున నున్నా' డని గ్రామ వాసులు గుసగుసలు ప్రారంభించిరి. లోకప్రతీయ అంతియే గదా! గుడ్డిలోకంబు కాకుల గుంపురన్న, మంచికిన్ గోల చెడ్డకు మించుగోల!' యను విధంబున దన యందున్న దోషముల గప్పిపుచ్చి, యితరుల దోషముల జూపునదియే లోకము. కాన శ్రీ శారదాదేవినిగూర్చియు లోకము జాలి పొందుట, సంకుచిత దృష్టిజూచుటయందాశ్చర్యమేమిగలదు? అయినను సామాన్యులైనచో న వాక్యములకు బాధ జెంది, ప్రపంచమును దూషించి, కోపగించుకొందురుగాని, 'యద్యపి రటతి సరోషం మృగపతి పురతోపి మత్తగోమాయుః। తదపిన కుప్యతి సింహః అసదృశ పురుషేషుకః కోపః॥' బలిసినట్టి జంబుకము మృగరాజగు సింహముముందెల్లెత్తి రోషముతో యరచినను, సింహము క్రోధము జెందదు. అట్లే మహాపురుషులయందు కోపమెచటగలదు? యనునట్లు సుఖదుఃఖ సములగు నిట్టివారెని యీ వాక్యములు చలింప జేయునా? లేదు.

ఇట్లు కాలము గడువగా, 'నా పదునాల్గవ యేట, గామారి పుష్కరిణిలో శ్రీరామకృష్ణ సన్నిధానమున

వేమండ, నన్ను జూచి శ్రద్ధతో, నిష్కళంక ప్రేమతో, ప్రాపంచిక విధులనుండి పారమార్థిక జీవన విధాన రహస్యముల నేర్పుతో నాకు బోధించిన ఆ పవిత్ర ప్రేమమూర్తి యిచ్చి యవిన విశ్వసించదగిన విషయమా? నేడేదేని మార్పు గలిగియుండునా? 'పతిర్హి దైవతం నార్యాః' పతియే తన దైవముగాన గష్టసుఖముల రెండింట దోడ్పడవలసిన హక్కు నాకు గలదు. కాన నా దక్షిణేశ్వరమునకు నే బోయి, యథార్థముగ వారున్మత్తులే యైనచో వారి సేవయే నాకు విధి. కాక వారాధ్యాత్మికానందమకరందమును గ్రోలచుండినచో, దదనుగుణ్యముగ నుత్కృష్ట మార్గానువర్తినియై మెలగెద'నని మన శారద మనమున చింతించెను. ఆ సంకల్పము క్రియారూపము దాల్చినగదా తన యాశ్వీత మీడేరుట: 'యథా చిత్తం తథా వాచో యథా వాచస్తథా క్రియాః। చిత్తే వాచి క్రియాయాం చ సాధూనామేకరూపతా॥' సంకల్పానుసారము వాక్కును, వాగనుగుణ్యముగ క్రియయు నుండును, మనోవాక్కాయములందు సత్పురుషులకు ఏకత్వము సిద్ధించును అను వచనసరణి త్రికరణశుద్ధియు, బట్టుదలయు, తీవ్ర జిజ్ఞాసయు గల శ్రీశారదాదేవి, తన కోర్కెను ఆచరణమున నుంచ గృషి సల్పుచుండ, ఆమె యోచనలకనుకూలముగ నా గ్రామవాసులు కొందరు శ్రీకృష్ణ చైతన్య జయంత్యుత్సవసమయమున గంగాస్నానార్థమై కలకత్తకు వెడలుచుండ, వారితో దానును బోవలయు

పని తన తండ్రికి దెలుప, దండ్రియు నామె యుద్దేశ్యమును గ్రహించి, 1872 వ సంవత్సరమున బ్రయాణసన్నద్ధ డాయెను. నాడు ప్రయాణ సౌకర్యములు లేకుండుటచే వారు కాలినడకన బ్రయాణము సల్పుచుండి, సుకుమారియు, నేనాడును నడక నెఱుగనిదియునైన మన శారదాదేవికి మార్గ మధ్యమున జ్వరమంకురించెను. అందుచే బ్రయాణమును నిలిపి, యొకచో విశ్రాంతి గైకొనిరా పితాసుతలు. నాటి రాత్రి శ్రీ శారదాదేవికి జ్వరము తీవ్రమాయెను. అంత, నెనిమిది వత్సరముల ప్రాయమును, కట్టని దీర్ఘకుంతల యును, నీలవర్ణమును గల యొక బాలిక శారదామణిని జేరి, తన మృదుహస్తమున నామెను దాక జ్వరముపశమించెను. అది గాంచి శారదాదేవియు 'నీవెవ్వరవమ్మా?' ఎటనుండి యరుదెంచితివి' యని ప్రశ్నింప నబ్బాలికయు నామెకు తాను సోదరి ననియు, దక్షిణేశ్వరమునుండి వచ్చితిననియు దెలిపి యదృశ్యమయ్యెను. మరుసటి దినము శ్రీ శారదాదేవి యారోగ్యముగ నుండుటచే, నొక పాలకిని గుదుర్చుకొని, వారిరువురు దక్షిణేశ్వరమును జేరిరి. శ్రీ శారదాదేవినేగాక సర్వమును మరచి, యఖిలమును శ్రీ కాళికాస్వరూపముగ వీక్షించు శ్రీరామకృష్ణ దేవుడామెను ఎట్లాదరించెను? ఈ విషయమును మనము జూచుచో నాశ్చర్యము కలుగును. శ్రీ రామకృష్ణదేవుడామెరాకకు విముఖత్వమును బ్రకటింపక, 'వచ్చితివా మంచిది' యని సంతసమును వెలిబుచ్చెను.

అట్లు శ్రీరామకృష్ణునిచే సన్మానితమైన శ్రీ శారదాదేవి, స్వచ్ఛమైన మణిచందమున నెట్లు ఆయన సన్నిధానమున మని, ప్రవర్తించి ప్రకాశించెనో, ఆ దివ్య దాంపత్యవిధానమెట్టి పవిత్రత గలదియో చూచెదము. శ్రీ శారదామాయి జీవితమున నిక ప్రథమ విషమ పరీక్షాఘట్టము రామన్నది. ఆ పరీక్షయందెట్లు మన శారద విజయము గాంచి, సర్వమానవాళి నాశ్చర్యానందముల ముంచినదో గాంచెదముగాక! పూర్వము ఏ మహాపురుషుని జీవితమునను సంభవింపని కఠిన పరీక్షాసమయము, అటులే, ఏ వ్యక్తియు నితఃపూర్వము తక్షణమొసంగజాలని పవిత్ర దివ్యానుభవపూరితమైన సమాధానము! అదియే ఆమె పురోభివృద్ధిని సూచించుచు, మనకందించు దివ్యసందేశము! అదియే మన హృదయముల పై శిలాశాసనముపగిది వెలుగొందవలసిన అమరవాణి! ఆ సంఘటనమేదియో ఒకింత గ్రహింతముగాక! శ్రీ శారదాదేవి దక్షిణేశ్వరమును జేరినంత నొకనాడు శ్రీ రామకృష్ణుడామెను జేరబిలచి, 'అమ్మా, శారదా! నీ రాక నన్ను ప్రపంచప్రవృత్తునిగ జేయుటకా? లేక నా మార్గావలంబినివై నీవాధ్యాత్మికానుభవముల నొంది, ఆ యమృతము నాస్వాదించి, యున్నతానందశిఖరముల నధిష్ఠించి, సర్వప్రపంచమునకాదర్శ మాతృస్థానము నలంకరించుటకా?' యని ప్రశ్నింప, బూవు పుట్టగనే తన సుగంధములు వెల్లడలి వెదజల్లుచందమున జన్మసిద్ధురాలగు మన

శారదామాయి, విషయవాసనలకు దూరమైన ఆ సాధ్వీ రత్నము, చిరునవ్వు మోమున నాట్యమాడ, నిశ్చల దృష్టుల గురుదేవునిపై బరపి, మృదు మధుర వచనముల మెల్లన, 'పారమా ర్థ మార్గమున మీకు తోడ్పడుటకును, యా మా మున నె నభివృద్ధి గాంచుటకును' అని క్లుప్తముగ జిన్ని మాటల సమాధానమొసంగెను. అహా! ఏమి సమాధానము! తన స్థితిని దాను గ్రహించి, ప్రాపంచిక విషయముల నణగ ద్రొక్కి, సర్వోత్కృష్టాధ్యాత్మికానుభవ సంపదల దుల దూగ నిశ్చయించుకొనిన నామెయొక్క ఆత్మవిశ్వాసమును గాంచుడు. అందుచేతనే, ఆత్మ, మార్గ, గురు, దైవ, విశ్వాస చతుష్టయములో, నాత్మవిశ్వాసము తచ్చతుష్టయ మున ప్రథమస్థానమలంకరించియున్నది. అట్టి యాత్మ విశ్వాసము, స్వీయాధిక్యతను గ్రహించుకొనిననాడే కలు గును. చూచితిరా, శ్రీ శారదాదేవి యెట్టి యాత్మవిశ్వా సముగల యాదర్శవ్యక్తియో!

శ్రీ రామకృష్ణదేవుని దివ్య చరణసేవ గావించుచు, దృష్టుల పారమార్థికాభివృద్ధికై ప్రసరింపజేయుచు, ముదు సలియు, ప్రేమాశ్రుదయు, శ్రీ రామకృష్ణ దేవుని జననియు నగు జంద్రామణీదేవిని తన మాతృదేవిగ నారాధించుచు, నామె సౌకర్యముల జూచుచు, శ్రీ గురుదేవుని యతి సున్నిత జీర్ణకోశమునకు దగు భోజనసదుపాయముల జూచుచు,

నప్పటికే శ్రీ గురుదేవు నాశ్రయించి యున్న విద్యాధిక లును, భక్తియుక్తులును, సంపన్నులును, నిష్కల్మష హృద యులునగు నరేంద్ర, రాఖల, కాళీ, నిరంజన్, జోగిన్ మొదలుగాగల యువక శిష్యసమూహములు శ్రీ రామకృష్ణ నాజ్ఞచే దక్షిణేశ్వరమున నుండుకాలముల, వారికి భోజనాది వ్యవహారముల జూచుచు, నిన్నింట మునిగియు, గ్రమ విధానమున సాధనల జేయుచు, నా దినములలో మన శారద దక్షిణేశ్వరీ యాలయమున, శ్రీ రామకృష్ణ గురుదేవు సన్నిధానమున, దివ్యాధ్యాత్మిక వాతావరణమున మగ్నయై కాలము గడుపుచుండెను. కాని, శిష్యులచేతను, జనసమూ హముచేతను అహర్నిశలు శ్రీ రామకృష్ణుడు పరివేష్టింపబడి యుండుటచే నామెకు శ్రీ గురుదేవుని చరణసేవ జేయు భాగ్యము లభింపమిచే నా చింత ఆమె హృదయమును అగ్నివలె దహింపదొడగెను. అంత నొకనాడు శ్రీ గురు దేవుని భోజన సమయమున, 'దేవా! మీ పాదసేవా భాగ్యము లెక్కురు అనుభవించుచుండ నాకెప్పుడు అవకాశమిచ్చెదరు? అట్టి పుణ్యమును నాకు బ్రసాదింపు' డని వేడ, శ్రీ రామ కృష్ణదేవుడును ఆమెను రాత్రి పండ్రెండు గంటలకు రానవ కాశమిడ, నామె హృదయము ఉబ్బి గంతులు వైచెను. ఆవేవిధముగ నామె ప్రతిదినము అర్ధరాత్రి గురుదేవుని చేరి, రెండు గంటలవరకు పాదసేవ చేసికొనుటయు, అనేక అధ్యాత్మిక విషయముల వారినుండి గ్రహించుటయు, శ్రీరామ

కృష్ణునికి దరచు వచ్చు వివిధ సమాధుల వీక్షించి, గ్రహించి, పరుల వారికి స్మృతి గలిగించుటయు జరుగుచుండెడిది.

అట్టి సర్వోత్కృష్ట ఆధ్యాత్మికానుభూతుల నానందించుటకు, శ్రీ శారదాదేవి తన సాధనావిధానమున విశిష్ట విధానమవలంబించి, అందు స్థిరత్వమును సాధించి, ప్రపంచాదర్శయై వెలొందును. ప్రథమమున శ్రీ శారదాదేవి శ్రీ రామకృష్ణుని సాన్నిధ్యమున మనుచు, శ్రీ రామకృష్ణుడు జగన్మాత యగు కాళికా సందర్శనా ఫలితముగ సమస్త స్త్రీ లోకమున, సృష్టి స్థితి లయ కారిణియు, ఓంకార స్వరూపిణియు, సర్వమోక్షప్రదాయనియు నగు నా భవతరణినే గాంచి, వారిని మాతృదేవతగ భావించుటయు వీక్షించెను. కాని కన్నుదోయికి నన్యకాంతలడ్డంబైన మాతృభావన జేపి మరలువాడు' అని ప్రహ్లాదునిగూర్చి భాగవతము వచించినట్లు స్త్రీలను దల్లిగ గాంచుటయందు విశేషమావంతయు నామెకు గోచరింపలేదు. అందుచే శ్రీ రామకృష్ణునియందు గల పురుషత్వ, భర్తృత్వద్వయము నావలకు ద్రోసి, మాతృత్వమును సుప్రతిష్ఠితమొనరించి, శ్రీ రామకృష్ణుని జననిగ భావించి ఆనందించుచుండెడిది. తల్లి బిడ్డ సంబంధముచేగాని పవిత్రత కలుగదనియు, నది కలిగినగాని ఆధ్యాత్మికమార్గము సున్నితము కాదనియు నామె దలంచి యుండెనేమో! అట్లు శ్రీ రామకృష్ణుని దల్లిగ భావించి, తాను

సకల ప్రపంచమునకు పవిత్ర మాతృమూర్తియై తనరెను. మరియు వంతలో వ్యాప్తిగాంచక, తన ఆధ్యాత్మికాభివృద్ధికి సాధనాదుల నొనర్చి, అనుభవము నొంద సంకల్పించి, నా శ్రీరామకృష్ణ దేవునే గురుస్థానమున నుంచి, పారమార్థిక గమ్యమును సుసాధ్యము గావించుకొనెను. గుర్వనుగ్రహమువినా బ్రహ్మానందానుభూతి దూరమని గ్రహించెనేమో! అట్లు శ్రీ రామకృష్ణ దేవుని జగద్గురువుగ గుర్తించి, తాను జగద్గురువై వెలుగొందెను. పై విధానముచేగూడ తన సాధన సమగ్రము కాదని యెంచి, ఆ దేవత్వము నొంద నిచ్ఛగించెనో యనునట్లు, మరల నా శ్రీ రామకృష్ణునే దేవతాపీఠమున నధిష్ఠింపజేసి, దైవముగ బూజించి దేవత్వమును బొందెను, మరియు 'ఆదౌ సగుణం' ప్రథమమున సగుణము అనుచందము శ్రీ రామకృష్ణ దేవుని సగుణమున నారాధించి, 'ఉపాసకః క్రమేణాద్వైతసంస్థానం ప్రాప' ఉపాసకుడు క్రమముగా నద్వైత సంస్థానమును బొందును త్రిపాద్విభూతి మహానారాయణోపనిషత్తు వచించు రీతి క్రమముగా సగుణము నతితించి, దుర్దర్శమును, గంభీరమును, ప్రసన్నమును అగు 'ప్రజ్ఞానం బ్రహ్మ' అను అగాధస్థితిలో మగ్నమై, సమాధిసౌఖ్యముల విహరించెను. అట్లు శ్రీ రామకృష్ణుని దైవముగ బూజించి, తాను లోకారాధ్యయై వెల్గొందెను. ఇదియే ఆమె అనుసరించిన మాతృ ఆధ్యాత్మిక సాధనామార్గము.

ఇట్లు కాలము గడుపగ, యథాప్రకారము శ్రీ శారదా దేవి యొకనాడు తన కోమల హస్తములచే గురుదేవుని మృదు పాదపద్మముల మెల్లన నొత్తుచు 'స్వామీ! నన్ను గూర్చి మీ యుద్దేశ్యమేమి' యని చిన్ని చిరునవ్వుతో ప్రశ్నింప, అర్ధసమాధిమగ్న హృదయుడగు నా గురుదేవుడు 'సృష్టి స్థితి లయముల సక్రమరీతి నెద్దేవి జేయుచున్నదో, ప్రతిదినము నాచే నీ దేవాలయమున నర్చనల నెద్దేవి గ్రహించుచున్నదో, ఏ మాతృరూపిణి నవమాసములు మోసి, మోక్షార్హమగు నీ శరీరమును నాకు బ్రసాదించెనో, ఆ దేవియే యీ రూపమున నిట నాకు పాదసేవ గావించు చున్నది' అని వెంటనే ప్రత్యుత్తర మొసంగెను. ఆలకిం చితిరా, వారి సంభాషణా మాధుర్యము! గ్రహించితిరా, యంచలి సారాంశము! కనుగొంటిరా, ఆ యపూర్వ దాం పత్యవిధానము! వారిరువురు అర్ధరాత్రియందేకాంతమునం దున్నను, వారిది మాతాపుత్ర సంబంధము. మరియు మాతా పుత్రి సంబంధమెయై యున్నది? శ్రీ రామకృష్ణుడు వ్యావ హారికముగ భర్తయైనను, పురుషుడైనను, అందుండు పురు షత్వమును వైదొలగించి, మాతృత్వమునే నెలకొనజేసి కొని, మన శారద శ్రీ రామకృష్ణుని దల్లిగ జూచెను. ఆహా! తంత తములుగూడ, సర్వప్రపంచమును శక్తిగ భావించి మాతృరూపమున దర్శింపుమనిగదా బోధించు చున్నవి! 'ప్రపేదిరే ప్రాక్తన జన్మవిద్యాః' హిమగిరి

మితకు విద్యాభ్యాసకాలమున, బూర్వజన్మ స్థిత విద్య లన్నియు నామెను బొందెను అని కాళిదాస మహాకవి పలికినరీతి, దంత్రార్థసారములీయనకు జన్మతః యలవడి యుండెనుగదా! శ్రీ రామకృష్ణుని మనోభావముల బరీక్షించుటకో, లేక తానే సర్వదేవీస్వరూపమని దృఢ నిశ్చయ యగుటకో యనునట్లు గురుదేవు నడ్విధంబున ప్రశ్నించి, యుచిత ప్రత్యుత్తరంబునొంది సంతృప్తి జెందెను.

పై విధానమున, గురుసేవాసందర్భముల, శ్రీరామకృష్ణునకు దరచు గల్గు సమాధుల నామె గాంచుచు, వారిని బాహ్యస్మృతికి దెచ్చుటకు యత్నించి విఫలయై, భయవిహ్వలయై, తెల్లవారుదనుక నొక్కొక్కసారి మేల్కొని యుండెడిది. ఇట్లు కొన్ని దినములు ఆమెకు నిద్రయే యుండెడికాదు. దీనిని గురుదేవుదెరింగి, ఆమె కష్టమును చూచు యుద్దేశముతో, నే యే సమాధికేయే లక్షణములుండునో, యే విధముగ నా మనమును బాహ్యస్మృతికి దెప్పించవలయునో, మొదలగు అనేక సమాధి రహస్యముల విపులముగ నామె కుపదేశించెను. అట్లు సర్వాధికారములచే జెల్వొందుచు శ్రీ రామకృష్ణునికి నారాధ్యదేవతయై, వారిచే షోడశీ నామక పూజనుగూడ స్వీకరింప నర్హత శ్రీ శారదాదేవి యార్జించెను. అప్పుడు, శ్రీ రామకృష్ణ భగవానుడే, యుమామహేశ్వర స్వరూపమవియు, నాతడే సకల దేవదేవి మూర్తి

యనియు, సమస్త మంత్రరూపమనియు, నట్టి యా మూర్తిని సేవించిన సర్వదేవతామూర్తుల సేవించినట్లగునని శ్రీరామ కృష్ణుని యథార్థ స్వరూపమును గుర్తెరింగి, గాఢ విశ్వాస ముతో సేవించుటచేతనే యట్టి మహోన్నత స్థితుల నామె యధిరోహించెను. దివ్యమైన బ్రహ్మానందానుభూతికి బునా దిగా శ్రీ శారదాదేవి తన పవిత్రతను అభివృద్ధి గావించు కొనుచు అమృతకిరణ సంపన్నుడగు తారానాధుని దిలకించి, 'ఓ చంద్రుడా! నీకైనను కొంచెముగ మచ్చ గలదుగాని, నా పవిత్ర జీవితమునమాత్రమిసుమంతయేని కళంకమును రానీయకుము' అని ప్రార్థించెడిది! ప్రతి వ్యక్తియు నట్లు హృదయపూర్వకముగ నద్దేవుని బ్రార్థించుచో నింకేమి కావలయును? పరమ పవిత్రతా స్వరూపిణియగు నామెకీ ప్రార్థనమెందులకనెడు శంక గలుగవచ్చునుగాని, 'గతాను గతికో లోకః' గతము ననుసరించుటయే లోకపు దీరు గావున, దాము సర్వాతీతులమని యమ్మహాత్ములు ప్రవర్తిం చుచో, నితరులుగూడ యథార్థమగు ఆత్మానుభూతిని బొందక బూజల, ప్రార్థనల, సంకీర్తనముల, జపముల, ధ్యానాదుల గావింపక జెడుదురని గ్రహించి, సర్వులకాదర్శులై, యా దేవదేవుని బ్రా ంచు విధానముల, మనపై బ్రేమచే వారు దెల్పుచుండుట సహజమేగదా!

షోడశ పూజ

ఇట్టి పరమపావనమూర్తియైన మన శారదాదేవి, శ్రీ రామకృష్ణ దేవునకు జగన్మాతృస్వరూపముగా దోచి, నా మహాత్మునిచే నర్చింపబడుటయందాశ్చర్యమేమి? కాన ఆమెకు షోడశీపూజ నాబడు అర్చనయు జరిగినది. ఎట్లన: 1872 వ సంవత్సరము, మే నెలలో, శ్రీ కాళికా పూజా దినములలో నీ పూజా సంకల్పము. దక్షిణేశ్వర్ దేవాలయము పచ్చని తోరణములతో, వివిధాలంకారములతో నిండియుండ, ఆలయాధిష్ఠాన దేవియు సకలాభరణ భూషితయై, షోడశవర్ష ప్రాయయై భక్తుల ననుగ్రహించుచున్నదో యనునట్లుండ, నద్దేవిని దర్శించి, నమస్కరించి, చైతన్యవంతమగు నా కాళికామాయి తేజోస్వరూపమును దిలకించుచు, దన్మయత సంకీర్తనల నొనరించు భక్త సమూహముతో నా దేవాలయమంతయు గిటకిటలాడుచుండెను. ఆ సుదినమున శ్రీరామకృష్ణ దేవుని గదియందు రాత్రి తొమ్మిది గంటలకు నీ షోడశీ పూజయు నారంభింపబడెను. శ్రీరామకృష్ణుని సమువున శ్రీశారదయు నట నుండెను. పూజా ప్రారంభమున దేవికై నిర్దేశింపబడిన ఆసనముపై శ్రీ శారదాదేవి నాసీనగమ్మని గురుదేవుడు గోరెను. అంత విధియుక్తముగ శ్రీ రామకృష్ణుడు, శ్రీ శారదామాయికి షోడశోపచారముల నొనరించి, శాస్త్రోక్తముగ నామెను

బాజించెను. పూజ సమాప్తి నొందునప్పటికి నర్ధరాత్రి యయ్యెను. అంతదనుక శ్రీ శారదా దేవియు నిశ్చలముగ బాహ్యప్రజ్ఞా దూరమై, సర్వమును మరచియుండెను, అంతమున సద్గురు దేవుడును సమాధిస్థితుడయ్యెను, అట్టి లాహావశ్యమున నున్న శ్రీ రామకృష్ణుడు కొంచెము బాహ్య ప్రజ్ఞ నొంది 'సర్వము నీవయే దేవీ' యని యామెకు ఆత్మార్పణము గావించి, సర్వార్పణము గావించుట తోడ నా యర్చన సాంతమయ్యెను. ఏమి ఈ పూజా విధానము! ఆరాధ్య దేవత భార్యయా. భార్యనర్చించుట లోకమందెచటనైన గలదే? అదియే యందలి రహస్యాతి రహస్యము! నిజముగా, భార్యను భార్య యను దృష్టితో జూచిన మానవుడెవ్వడును అట్లు జేయజాలడు. కాని భార్య యని వ్యావహారికముగజూచినను, ఆమెయందు లోకైకమాత యగుకాళికనే వీక్షించి, ఆమెను సాక్షాన్మాతృస్వరూపముగ దిలకించి, కామలేశము లేని నిష్కళంక హృదయుడైనవాడే యట్లొనరింపగలడు:గాని యందరికివి సాధ్యముకాదుకదా! సర్వ నారీలోకమును మాతృస్వరూపముగ జూచువారికి నే స్త్రీయందుగాని భార్యదృష్టి గలుగునా? దుర్లభము!

ఇక, నిట నర్చింపబడిన వ్యక్తియో, కేవల దేవాంశ సంభూతయు, గామపాశములగు నీ సర్వవిషయముల బరిత్య జించినదియు, నిక భావికాలమున శ్రీ రామకృ గురు

పీఠము నలంకరింపబోవునదియు, సూర్యాతపతప్త జీవులకు విశ్రాంతి నొసగు వటవృక్షమువోలె, విషయాగ్ని పీడిత సమస్త ముముక్షువుల కాశ్రయమునిడి దరింపజేయు నాధ్యాత్మిక శీతకిరణశోభితయు, సహానరూపమున గేవలము భూదేవియే యని ప్రఖ్యాతి గల్గినదనియు, పవిత్ర ప్రేమచే భగవంతుడు సుసాధ్యమని, ఆ ప్రేమను వ్యక్తీకరింపజేయ నవతరించిన లోకైక ప్రేమస్వరూపిణియు నగు శ్రీ శారదామాయి ప్రప్రథమమున నీ విధముగ శ్రీ రామకృష్ణ దేవునిచే నారాధింపబడుట శ్రీ శారదాదేవియొక్క పూజనీయ జీవితమునకు నాందియై వెలసెను. నాటినుండి యనేక సన్న్యాసులచేతగూడ నామె యర్చింపబడుచున్నది. లోకము నొక్కపర్యాయము పర్యాలోచన చేసిన, బుర్వ చరిత్రముల గల సర్వవనితలకు మించిన యర్హతను బొందుటయేగాక, సర్వసంగవివరితులగు యతీశ్వరులచే కూడ బూజింపబడు స్థానము యీమె యొక్కతకే దక్క వేరెవ్వరికి నగోచరము. సర్వమును మాతృరూపముగ దిలకించు నా శ్రీ రామకృష్ణునే 'యా దేవీ సర్వభూతేషు మాతృరూపేణ సంస్థితా' ఏ దేవి సర్వభూతముల మాతృరూపమున నున్నదో ఆమ సప్తశతీ వాక్యవిధానమున దగ వీక్షించి, మరల తానే సకలమునకు మాతృదేవియై చెల్వొందుటయే, శ్రీ శారదామాయి యిట్టి లోకపూజ్యతను బొందుట యందలి రహస్యము. మాతాశిశువుల సంబంధమెంత పవిత్రమో గాంచితిరా!

పై విధాన శ్రీ రామకృష్ణుని సన్నిధిని సర్వసాధనల సాధించి, సమాధ్యవస్థలగూడ ననుభవించుచు, అర్చింపబడు చుండు కాలమున నామెను శ్రీ రామకృష్ణుడొకదినమున చేర బిలచి 'నేను చేయవలసిన కార్యముల జేసితిని. ఇక నీవు చేయవలసినది చాల గలదు. చేయుదువా?' అని ప్రశ్నింప నామె యందులకు మౌనము వహించెను? అర్ధాంగీకార మేమో! సహజ నిరాడంబరమో! గురుదేవుడు అంత నామెకు మంత్రోపదేశవిధానమును దెలుపుచు, నెవరి కేమంత్రమె ట్లుప దేశింపవలయునో మున్నగు పద్ధతుల బోధించెను. అంతియ గాక, భావికాలమున తమ యైహిక జీవితముల త్యాగమయ మొనరించి ఎవరు సన్న్యసింతురో, ఆమె పై నాధారపడుదురో, ఆ శిష్యకోటిని శ్రీ రామకృష్ణుడామెకు బరిచయము జేసెడి వాడు. ఆ యువకబృందమునకు ఆహార పానీయముల నేర్పరచి ఆమె యాదరించెడిది.

ఒక దినము, సన్న్యసించిన పిమ్మట అద్భుతానందు డనబడిన లాటు అను శిష్యుడు పంచవటిక్రింద సాయంసమ యమున ధ్యానమొనరించుచుండ, గురుదేవుడరుదెంచి, 'నాయనా! ఇట ధ్యానము చేయుచున్నావా? నీ ధ్యానాధిదేవత జగన్మాత. ఆమెయే శారద. ఆమె గృహమున కార మేమొ గ్గ్న ్ యున్నది. ఆమెకు సహాయమొనర్పుము' అని శ్రీ శారదాదేవి గొప్పదనమును బోధించుచు, 'శక్తి జ్ఞానం

వినా దేవి నిర్వాణం నోపలభ్యతే।' శక్తి జ్ఞానము లేక ముక్తి అలభ్యమను తంత్రార్థమును శిష్యునకు గురుదేవుడు దేశించెను. అట్లు శ్రీ శారదా దేవి సర్వానుభవయుక్తై, భక్తుల మాతృదేవియై రూపొందిన బిమ్మట, శ్రీ రామకృష్ణ దేవుడు 1886 వ సంవత్సరము అగస్టు 16 వ తేదీ, గారి దేహమును పరిత్యజించెను. తల్లిని బాసిన శిశువులచందము శిష్యులు విలపింపసాగిరి. మన శారదయు, మిగుల దుఃఖమున శ్రీ రామకృష్ణ సన్నిధికేగి, 'అమ్మా! నన్ను వదలి పోతివా? ఈ బిడ్డను ఎవరికి అప్పగించితివి? తల్లి లేని పిల్లలుగ మమ్ముల జేసితివా!' అని యాక్రందించెను. ఏమి యీ పవిత్ర సంబంధము! ఇట్టి సమయమునైన శ్రీ రామకృష్ణుడు ఆ తల్లి దృష్టికి దల్లియేగదా!

పారివ్రాజ త్వము

శ్రీ రామకృష్ణ దేవుని నిర్యాణానంతరము 'పుణ్య క్షేత్రముల బలువురు మహాపురుషులు, సాధుసత్తములు, భక్తులు మొదలగువారు తపమాచరించి యుండుటచే, పరమ పవిత్ర భావములు నెలకొని యుండును, పారమార్థిక చింతగలవాడా తీర్థముల గ్రుమ్మరునేని తప్పక గొంత పవిత్రతను భగవత్సాక్షాత్కారమును బొందగలడు, కావ నీవును

యాత్రాస్థలముల దర్శింపుము' అని పూర్వము మన శారదమ శ్రీ రామకృష్ణుడా దేశించియుండుటచే, నామెయు, యాత్రలు సేయ సంకల్పించెను. ఆమె వెంట నరుగ, యోగానంద, అభేదానంద, అద్భుతానందులును, శ్రీ రామకృష్ణ వచనామృత గ్రంథకర్త యగు మహేంద్రనాధుడును, అతని సతీమణియు గురుదేవుని మేనగోడలు లక్ష్మీదేవియు, గోలప్‌మాయి మొదలగువారు సంసిద్ధులైరి.

'కాశ్యాం తు మరణాన్ముక్తిః' కాశీయందు మరణము వలనమాత్రమే ముక్తి యను ఆర్యోక్తి విధానమున బరమ పావనమగు గంగాస్రవంతిచే నావృతమై, మణికర్ణిక, దశాశ్వమేధ, హరిశ్చంద్రాద్యనేక ఘట్టములతో నలరారుచు, పరమ పూజ్యులును, తపోనిమగ్నులును, నర ద్వంద్వాతీతులును, అవధూతావతంసలు నగు మహాపురుషపంక్తిచే నలంకరింపబడుచు, సర్వవేళల బురాణ దంపతులును, ఆదిదేవులగు అన్నపూర్ణా విశ్వేశ్వరుల దర్శించి. అఘవిదూరులై వచ్చుచు బోవుచుండు యాత్రికసందోహముచే శోభాయమానమై, క్షేత్రరాజమై తనరు వారణాసీ దివ్యక్షేత్రమును; ఆధ్యాత్మిక జీవనమునకు ద్రికరణము లేకమైనగాని అనుభవ విభూతి దుర్లభమని బోధించుచున్నదో యనునటుల గంగా, యమునా, సరస్వతీ నాబడు మూడు మహానదుల సంయోగముచే బునీతమై త్రివేణీ నామమున జెల్వొందుచు, త్రికరణ

ముల మనస్సు అంతర్గతమై, ఎట్లు అగోచరమో అట్లు ఈ ప్రవంతీ త్రయమునను సరస్వతి అబాహ్యమై, అంతర్వాహినియై, తీర్థరాజమని పేరెన్నిక గనిన ప్రయాగ పుణ్యక్షేత్రమును; కౌసల్యా దశరథుల ముద్దుల తనయుడై, శిష్ట రక్షణ దుష్టశిక్షణాదుల సల్పుచు, 'రామో ద్విర్నాభిభాషతే' రాముడు ద్వివిధముగ భాషింపడు అనునట్లు సత్యవాక్య పరిపాలనా దక్షుడై, 'న రామః పరదారాంశ్చ చక్షుర్భ్యామపి పశ్యతి' రాముడు పరస్త్రీలను గన్నులతోగూడా గాంచడను వచనరీతి ఏకపత్నీవ్రతుడై, ఆదర్శ గృహస్థుగా దనరుచు, దన లోపముల నవరించుకొనుచు, ఆదర్శ పుత్రుడై, ఆదర్శ భ్రాతయై, ఆదర్శ మిత్రుడై, ఆదర్శ రాజచంద్రుడై, ఆదర్శ ఆచార్యుడై, భారతీయ సంస్కృతిలో సర్వాదర్శ మూర్తిగా రాజిల్లుచు, 'రమైతీతి రామః' ఆనందము నొసంగువాడు రాముడనుచందమున దశరథరాముడవతరించిన పవిత్ర భూమియగు నయోధ్యా నగరమును; హిమవత్పర్వతముల జనించి, ప్రవహించి, నిర ల తోయముల సమస్త జనుల అప నివారణమునకు క్ష గైకొని, సర్వసౌదాత్తస్థితి జరెంచు సిద్ధిని నైపడి చెలువొందిన పవిత్ర గంగా నదీమతల్లిచే బరిష్కృతమగుటచేతను, కాక హిమాలయ గిరిరాజముల వెలయు బదరీనారాయణుని దర్శనా మురుగు ప్రయాణికులకు ద్వారమగుటచేతను హరిద్వారమని పేరు ప్రఖ్యాతుల గాంచిన హరిద్వారమహాక్షేత్రమును; దేవకీ వసుదేవుల

గస్తు ముక్తాఫలమై, నందయశోదల మురిపెంపు పట్టియై, బాల్యమాదిగ దన దివ్య విభూతుల బ్రస్ఫుటమొనరించుచు, నవనీత అనగా హృదయచోరుడై, అష్ట దిక్కులే భార్య లుగా గల్గి, పదహారువేల కళలను గోపికలుగా గలిగి, యోగీశ్వరుడై, పార్థసారథియై, గీతాప్రబోధకుడై, Blue indicates depth నీలత్వము గాఢత్వమును సూచించు నను విధాన అగాధ పారమార్థిక జ్ఞానవిభూషితుడై, సన్నిహితుని వలె నొప్పుచు సర్వాతీతుడై గోచరించు నీలమేఘశ్యాముడు, వనమాలాధరుడు, కస్తూరితిలకోపేతుడు, మురళీనాదవిలోలుడు, 'కర్షతి యోగినాం మనాంసీతి కృష్ణః' యోగుల మనస్సుల నాకర్షించువాడును' ఫలప్రదము చేయువాడును కృష్ణుడను వ్యుత్పత్తి అర్థమురీతి ఆబాలగోపాలముచే బేమింపబడు శ్రీకృష్ణ భగవానుడు గ్రుమ్మరుచు నాటల నాడిన పరమ పవిత్ర దేశమగు బృందావనమును, వైద్యనాథము మొద లగు పుణ్య భూముల దర్శించిరి.

అన్నింటిలో మన శారద నెక్కువగా నాకర్షించిన పుణ్యస్థలము బృందావనము. అందుచే నామె యందొక వత్సరము వసించెను. అటగల శ్రీ రాధాకృష్ణ మందిరమున రాధావిరహవేదన శారదామాయికి స్ఫురింప, శ్రీ రామ కృష్ణునండి యెడబాటు ఆమె మనమును గలవరపరుప జాల బాధ నొందెడిది. సదా యేకాంతవాసము నభిలషించియు,

యమునాతీర సైకతముల దిరుగాడియు, నందందు గాఢ ధ్యానవిమగ్నతను బొందియు, తీవ్రతరముగ దపమ్ము గావించియు, నచట నామె కాలమును వినియోగింప గడం గెను. ఒకదినము శ్రీ రామకృష్ణుడట నామెకు దర్శనమిచ్చి 'ఏమమ్మా! ఎందులకిట్లు విలపించుట? నేను సర్వవ్యాప్త ముగ నుంటినిగదా!' అని పలుక నామె హృదయతాపము చల్లారెను. ఆర్తివలన గదా సాధన జేయుట, వైరాగ్య మభివృద్ధిచెందుట, గురు సాన్నిధ్యము లభించుట, అను భవానందముల మగ్నత నొందుట! ఆ యార్తిచేగదా పూర్వము మనము గ్రహించిన శ్రీ శారదా దేవి గృహమువీడి దక్షిణేశ్వరమున గురు సందర్శనా భాగ్యమును బొందినది! ఆ యార్తి చేతనేగదా శ్రీ రామకృష్ణుడు లోకమాత యగు కాళికా సాక్షాత్కారమును బొంది ఆనందించినది. ఆ యార్తి చేతనేగదా బాలుడగు వేంకటరామన్ శ్రీ రమణమహర్షిగా విశ్వవిఖ్యాతి గడించినది! పైన నిర్వచింపబడిన ఆ యార్తి లేనిచో మానవ జీవితము వ్యర్థమేకాన, 'ఆర్తి లేనట్టి యవ కాశమేలనయ్య' అని, ఆర్తి లేక గేవలమవకాశముగల జీవి తములు వ్యర్థమని వక్కాణింపబడినది. అట్టి తీవ్రతర ఆర్తిచే మన శారదామాయి శ్రీ రామకృష్ణ సందర్శనానంద మున నోలలాడెను. 'కృష్ణా! ఇతరుల లోపముల జూచు ఖు నాకు లేకుండునట్లు అనుగ్రహింపుము. పరుల నేనాడు నేను నిందింపకుందునుగాక!' అనియు నామె ప్రార్థించెడిది.

అవును, ఎంతకాలమితరుల దోషముల వీక్షింతుమో అంత కాలము మన హృదయమున ద్వేషము నెలకొని యుండును. 'ద్వేష్యం దుఃఖమిహేష్యతే' అ ద్వేషమే దుఃఖముగా మహాభారత వాక్యము. ఆ దుఃఖముచే నశాంతి ప్రజ్వరిల్లి జీవితము దుర్భరము అగును. కాన సర్వమును ప్రేమించు మన శారద యితరుల దోషములగాక వారి సుగుణములనే దిలకించుచు, నే ఒక్కరిని ద్వేషింపక, అందరిని ప్రేమ వాత్సల్యముల గాంచెడిది. బృందావనమున సాధనాఫలితముగ నొకనాడామె తీవ్ర ధ్యానమగ్నయై సమాధిని బొంది, యెంతకును బహిష్ప్రజ్ఞ నొందకుంటచే బ్రథమమున యోగినీమాయియు, బిమ్మట యోగానందస్వామియు శ్రీ శారదామాయి కర్ణపుటంబుల భగవన్నామోచ్చారణము గావించిన గాని బాహ్య స్మృతి యామెకు గలుగలేదు. కొంచెము స్మృతి గలిగిన యంత 'దినుటకేమైన గావలయు' నని యామె పలుక, గొన్ని ఫలాహారముల నామెకు వారిచ్చిరట. శ్రీ రామకృష్ణుడుగూడ గొన్ని సమాధి సమయముల నిట్లొవరించెడివాడని ప్రతీతి. కాన నీమెయు శ్రీ గురుదేవుడనుభవించిన నాధ్యాత్మిక సంస్థితుల గరతలామలకమొనరించుచుండెను. ఇక్కడనే శ్రీ రామకృష్ణుని యాజ్ఞానువర్తినియై శ్రీ యోగానందస్వామికి బ్రప్రథమముగ మంత్రోపదేశము గావించెను. జ్ఞానభిక్షను బ్రథమమున మాతృదేవినుండి గ్రహించిన యోగానందుడు ముమ్మాటికి ధన్యుడు. ఇట్లు

అధ్యాత్మిక సింహాసనము నధిష్ఠించి, యిచ్చటనే సమస్త లోకమునకు గురువుగా వెలుగొందినది మన శారదామాయి.

ఈ యాత్రలతోడనే శ్రీ శారదామాయి తన పర్యటన ముగింపలేదు. మరల 1888 వ సంవత్సరమున, జనవరిలో శ్రీ రామకృష్ణదేవుని యాజ్ఞానుసారముగ గయాక్షేత్రమునకు వెడలెను. అద్వైతానందునితో బుద్ధగయనుగూడ ఆమె దర్శించెను. అంత గలగత్తకు దిరిగివచ్చె. మరల డిశంబరు నెలలో జగన్నాథమునుగూడ ఆమె దర్శించెను. 1894 వ సంవత్సరమున శ్రీ శారదాదేవి తన మాతా సోదరులతో మరల బృందావనమును దర్శించెను. 1901 వ సంవత్సరమున శ్రీ రామకృష్ణుని శిష్యులతో జగన్నాథమును రెండవ పర్యాయము ఆమె సందర్శించెను. తరువాత 1909 వ సంవత్సరమున రామేశ్వర యాత్ర సంకల్పించి, మార్గ మధ్యమున చెన్నపట్టణమున శ్రీ రామకృష్ణుని శిష్యుడగు శ్రీ రామకృష్ణానందునిచే నాహ్వానింపబడి అచటి శ్రీ రామకృష్ణ మఠమున మాసము దినములు వసించి, అనేక భక్తులకు మంత్రదీక్ష నొసంగెను. అంత స్వాములవారితో మదుర, రామేశ్వరములకు మన శారద యరిగెను. రామేశ్వరమున గర్భాలయములోనికి నర్చకులుగాక యితరులు పోవుటకు వీలులేదు. కాని పూర్వము వేదాంతకేసరియై, పాశ్చాత్య దేశముల తన వాక్సుధారసముచే మ్రోత

గాంచి, భారతదేశ ప్రాధాన్యమును మహాత్మ్యము ప్రశస్తిని చాటినట్టి యతివరేణ్యుడగు వివేకానందుడు రామేశ్వరము నకు జనుటయు, రామనాథపురాధీశ్వరుడు, ఆధ్యాత్మికానుభవ పథముల విహరించు ఆ యతికులచక్రవర్తికి శిష్యుడై యుండుటచే శారదాదేవికి స్వాగతమొసంగి రామలింగేశ్వరు సన్నిధికి బోవుటకుగూడ నాతడు దగు ఏర్పాటుల గావించెను. అందుచే మన శారదామాయికి నిత్యము ఆ పరమేశ్వరుని సన్నిధి సేవజేసికొను మహదవకాశము లభించెను. అంత నామె బెంగుళూరులో భక్తులకొరకై ఒక దినముండి, రాజమహేంద్రవరమున నఖండ గోదావరిలో స్నానమొనర్చి దాని బునీతమొనరించెను. అంతట నామె గలకత్తకు జేరెను. మరల 1912 వ సంవత్సరమున మూడవపర్యాయము అనేక శిష్యకోటి యనుసరింప నామె కాశికి బోయి అట రెండుమాసములు తపోనియతి నివసించెను. అప్పుడే ప్రక్కనగల బౌద్ధక్షేత్రమగు సారనాథమునుగూడ నామె దర్శించెను. ఇట్టుల సకల యాత్రాస్థలముల దర్శించి తరువాతి కాలము నంతటిని శిష్యులకొరకు నుపయోగించుచు జీవితాంతమువరకు గలకత్తయందే మన శారద గడిపెనని చెప్పవచ్చును.

తపోధీ...

ప్రథమమున మన శారదామాయి బృందావనాది క్షేత్ర వాసము సమాప్తి నొందించి కలకత్తకు జేరి, కామారి పుష్క రిణియందే యుండ సంకల్పించుకొనెను. శ్రీ రామకృష్ణ గురుదేవుడు శక్తిస్వరూపిణియు, సకలాధ్యాత్మికానుభవ విషయము, సమస్త దేవతా స్వరూపిణియు నగు మన శారదను జేరంబిలిచి, 'శారదా! నా తదుపరి నీకు అన్నవస్త్రాదులకు లోటుండదు. మరియు చిల్లి కానికైనను ఆశ్రయించితివా నీ సర్వస్వమును విక్రయించినట్లే సుమా' అని యా కామ కాంచన త్యాగమూర్తి తన జీవితకాలమునం దెవ్వరిని యర్థింపక, నిస్పృహుడై చరించుచు, కోటీశ్వరులే పాదాక్రాంతులైనను కన్నెత్తి చూడక 'లక్ష్మీశ్చంచలా' ధనము చంచలమనియు, 'అర్థ మనర్థం' అర్థము అనర్థమని గ్రహించి, ఆస్థితిలోనే యుండి మన శారదకు మహోత్కృష్టోపదేశము గావించెను. యథార్థముగ ప్రపంచమున దుష్కృతమున జరింపుటకే కామ కాంచన ద్వయమేగదా కారణము! ఆ కామమూలమున శివారాధన తత్పరుడును, మాతృభక్తిరతుడును, తపోసంపన్నుడగు రావణబ్రహ్మ వధింపబడినట్లుగ శ్రీమద్రామాయణమును, అటులే కాంచన అనగా ధనాశవలన ధృతరాష్ట్ర సూనుడును, కౌరవాగ్రజుడును, గర్వియు, అహంకారాదిక గుణయుక్తుడగు దుర్యోధనుడు

వమూలముగ నాశనమొందునట్లు శ్రీ మహాభారతమును బోధించుచున్నవి గదా! 'ధనమూల మిదం జగత్' ఈ ప్రపంచము ధనమూలమనియు, సర్వానర్థములకు నిదియే మూల కారణమనియు, ధన శృంఖలముల బారిబడక గాంక్షా దూరుడై యుండు నాత్మరతునికి వాని యాత్మబలముచే సర్వము సుసాధ్యమగునని శాస్త్రోపదేశమును, ఆచరణశీలు రగు మహాత్ముల ఆప్తవచనములునై యున్నవి, అట్టివారికి సర్వప్రపంచము జోహారు లర్పించుటయం దాశ్చర్య మావం తయునులేదు. 'నిస్పృహస్య తృణంజగత్' నిస్పృహానకు జగత్తు తృణప్రాయమగుచుండ, నిక గాంచనాదులును దృణ సమానము లేగదా!

ఆ విషయమును మనస్సునం దుంచుకొని, శ్రీ శారదాదేవి కామారిపుష్కరిణీ గ్రామముననే నివాసమేర్ప రచుకొనెను. ఈ విషయమును జననియగు శ్యామసుందరి దేవి కుమార్తెను జయరామవటికి యాహ్వానించెను. శారదయు జనని కానందము జేకూర్ప బుట్టినింట నాలుగైదు దినములు మాత్ర ముండి, మరల కామారిపుష్కరిణికే దిరిగి యరిగి, సాధనల నొనర్చుచు, అనుభవోపదేశమగు శ్రీ గురుదేవుని వాక్యముల నాచరించు దీక్షతో నన్యసహాయ మపేక్షింపక 'స్వాతంత్ర్యాత్ సుఖ మాప్నోతి స్వాతంత్ర్యా ల్లభతే పరం' స్వాతంత్ర్యము వలన సుఖమును, దానివలన పర

మును లభించునను అష్టావక్ర గీతోక్తి విధమున స్వాతంత్ర్య ముగ దీవ్రతపోజీవితమును గడుపుచుండెను. ఆమె ఏకాంత వాసమున నుండుచు, అనేక కష్టనిష్ఠురముల సహించుచు, సహనము నార్జించుచు, భావికాలమున నాధ్యాత్మిక గురుపీఠ మధిష్ఠించి ప్రపంచమునకు దివ్య సందేశముల నొసంగగల శక్తి గడించుచుండెను. అట్టి యేకాంత జీవితకాలమున నామె భుజించినదో, లేదో విచారించువారైనను లేకుండిరి. సామాన్య వ్యక్తులయినచో నున్మత్తులై పోవుదురు. కాని 'దుఃఖేష్వ నుద్విగ్నమనా స్సుఖేషు విగతస్పృహః' దుఃఖములకై పరితపింపక, సుఖములకై సంతసింపనివారు నగునట్టి మహర్షుల 'యుగాంతే చలతే మేరుః కల్పాంతే సప్తసాగరాః। సాధవః ప్రతిపన్నార్థా న చలంతి కదాచన॥' యుగాంతమున మేరుపర్వతము కదలవచ్చును. కల్పాంతమున సప్త సాగరములు ఏకము కావచ్చును. కాని ఆప్తకాములైన మహాత్ములు మాత్రము ఎన్నడును చలింపక నిశ్చలస్థితి నందుదు. మరియు రమ్య నిర్మిత మహారాజాంతఃపురముల నున్నను, లేక సింహ, శార్దూల, శరభాది హింస్రక మృగయుక్త అరణ్యమున నున్నను, 'అరణ్యే సదనే తుల్యే సమాహిత మహాత్మనాం' సర్వసములగు వారు రెంటి యందును నిర్లిప్తులై యుందురుగదా! అట్టి నిర్లిప్త స్థితియందు ఓలలాడు చున్నదగుచు, స్వగసాధనల దేలుచు, నీ కాలమున పంచాగ్ని తపమునుగూడ నామె యొనరించి తత్సిద్ధిని బొందెను.

యథార్థముగ నామెకు సాధన లవసరము గాకున్నను, 'శ్రేష్ఠః శ్రేష్ఠానుసారీ' అనునట్లు ఉత్తముల ననుసరించుచు సామాన్యులు సాధనజేసి అనుభవమును గడింపవలయును గాన మానవాకృతి ధరించిన మన శారదయు బాహ్యాచికమును నియమిత కాలముల గావించుచు, శ్రీ రామకృష్ణోపదేశముల, అనేక తదితర గ్రంథముల శ్రవణము జేసియు, ప్రాతః సాయంతనములలో జప ధ్యానముల నొనర్చియు జీవితమును నియమబద్ధ మొనర్చి, శాంతి నార్జించు విధానము బోధించెను. 'స్వయం తీర్ణః పరాన్ తారయతి' తాను తరించిగదా పరులకు మోక్షమిడుట, భావికాలమున దనకై శ్రీ రామకృష్ణునిచే నిర్మితమైయున్న పారమార్థిక గురుపీఠము నధిరోహించుటకు సర్వాధికారముల బడసి, సద్గుణ సుశోభితయై, సువర్ణమునకు మెరుగుబెట్టబడినట్లు తన సహజగుణములకు వన్నె అధికమగురీతి సర్వసాధనల సంపూర్తి జేసెను. అపుడు, గురు వగుటకు బూర్వము బహుక్లేశముల ననుభవించుచు, అనేక సాధనల జేయుచు, అనుభవానందముల మగ్నత నొందవలయును గదా! ఏ గురుస్థానము వహించినదో, ఆమె ఉపదేశవిధాన మె యోజింకమ ముందు గాంచెదము గాక!

కలకత్తా ప్రవేశము

ఇట్లు శ్రీ శారదామాయి ఆ గ్రామమున నొక వత్స రము నివసింపగ, శ్రీరామకృష్ణదేవుని శిష్యులందరును, ముఖ్యముగ స్త్రీశిష్యులగు గోలప్‌మాయి, యోగినీమాయి, గౌరీమాయి మున్నగువారు శ్రీ శారదకు సన్నిహితులై యామె ఆధిక్యతను గ్రహించియుండిరికాన, గురుదేవుని శిష్యులకుజెప్పి శ్రీ శారదా దేవిని గలగత్తకు నాహ్వానించిరి. శ్రీ శారదయు నా యాహ్వానమును సమగ్రముగ నాలోచించి సమ్మతించెను. ఆ విధముగ నామె కలకత్తకు జేరుటతోడ శిష్యవర్గమంతయు ముఖ్యముగ స్త్రీలు ఆనందించిరి. వారి యానందమునకు గారణము లేకపోలేదు. శ్రీ రామకృ ష్ణుడున్నకాలములు, శ్రీ శారదకూడ నటనున్నను, ఎవరికిగూడ దెలియదు. ఆమె తెల్లవారుఝామున మూడు గంటలకే మేల్కొని గంగా స్నానాదుల ముగించి తన గదిలోకి వెళ్ళె డిది. మరల బయటికి వచ్చెడిదికాదు. అందుచే నామెను గూర్చి శ్రీరామకృష్ణుని శిష్యులలో కొద్దిమందికే తెలియును గాని కలకత్తవాసులకు దెలియదు మరియు, గొందరు శ్రీ రామకృష్ణుని ధర్మపత్నియగుటచే నామెను గౌరవింపవలెనను కొనిరి కాని ఆమెయే, తమకు దన వాక్సుధామహిమచే ముక్తినొసంగు జ్ఞానప్రదాత్రియని వారు భావింపలేకైరిగదా! అపుడు, సామాన్య వనితవలె మెలగుచు, తన యనుభవవం

వదమ లోనిమ్ముడుకొనుచుండు నామెను గ్రహించుట ఆమె సన్నిహితులకే దుస్సాధ్య మగుచుండ నిక నేనాడును ఆమెను చిలికింపనివారలచే నామె గ్రహింపబడునా!

ఆమెలో గల ఏ దివ్యశక్తిని గనుగొనెనో కాని శ్రీ శారదానందస్వామి శ్రీ శారదాదేవిని నిర్యాణపర్యంత మామెను వీడక ఆమె వసతుల నేర్పరచి సకల శుశ్రూషల నొనరించుచుండెను. శ్రీ శారదామాయికి, ఆమె శిష్యురాండ్రకు వలయు సౌకర్యముల జూచుచు, ఆమె ఆజ్ఞల శిరసావహించుచు, దన వినయ విధేయతలచే నామె ప్రేమను జూరగొనుచు, ఆమె అనుగ్రహ వీక్షణములకు ప్రార్థన సలుపుచు, ఆ మాతృమూర్తి హృదయమున శాశ్వత స్థానమును సంపాదించుకొనెను. శారదానందుని సంకల్పముల నెరింగిన మన శారదయు నాతని నధికముగ ప్రేమించుచు, అతని సాధనలగలుగు సంశయ పరంపరను వినాశమొనరించుచు శాంత్యానందముల నిమగ్నుడగుటకు సహాయభూతయై, మాతృదేవతయై, గురుమూర్తియై చెల్వొందెను. కాన ఆమె శాసెట కరిగినను శారదానందుని దనవెంట గొనిపోయెడిది. శ్రీ శారదాదేవి, చివరి దినములలో రోగగ్రస్తయై యుండు కాలమున శిష్యురాండ్రు ఆమెకు నడిరేయి ఒక్కొక్క పర్యాయము ఔషధ మీయవలసివచ్చును. ఔషధ సేవనమున కామె యిచ్చగింపనిచో వారు వెంటనే ఆ అర్ధరాత్రి సమ

యమునసే శారదానందుని రప్పించుదురు. ఆతడును సహజ భక్తి శ్రద్ధలతో మాతృశ్రీచెంత జేరి, మాతృభక్తి సుఖమున దొలికిసలాడ, మెల్లని మృదు మధురస్వరమున 'అమ్మా! మీ ఆరోగ్య మెట్లున్నది? ఔషధమును సేవించితిరా? లేనిచో కొద్దికాలముండి పిదప స్వీకరింపుడు' అని చల్లగ బలుకును. అంత నామెయు 'నాయనా! అట్లే చేయగలను. నీవు వచ్చి బలాత్కరించి మందును త్రాగింపజూతురు కాని నీవు పలికినట్లుగ నెమ్మదిగ వచింపరు. నీకు శ్రమ కలిగించిరి. బిడ్డా! యిక నీవు పరుండుము' అని తన హస్తముచే నాతని శిరస్సు నిమురును. ఖ తవాత్సల్యముప్పొంగ బుజ్జగించి ఆతని దిరిగి బంపివేయును. ఆ తల్లి బి ల సంబంధమట్టిది, పసిబిడ్డవలె నామె పదసన్నిధిని మనుచు, సంతతము ఆమె దృష్టిమందుడు, ఆమెను దర్శించుచు, ఆమె ఉపదేశవాక్య పారము మనసార గ్రోలుచు మనిన శారదానందుని అదృష్టమే అదృష్టము. 'సాధూనాం దర్శనం పుణ్యం స్పర్శనం పాపనాశనం' అనునట్లు శ్రీ శారదామాత దర్శన స్పర్శనము లచే విశేష ఆధ్యాత్మికానందముల బడసి, దుఃఖభాజనమగు నీ జనన మరణ పరంపర నధిగమించి యుండెను శారదానందుడు, అట్టి పవిత్రవ్యక్తి కావున. మన శారద 'నే నెట కరిగినను నా బిడ్డ శరత్తును అనగా శారదానందుని మాత్రము తీసికొని పోయెద'నని అతనిగూర్చి పలికెడిది.

పై విధముగ నామె ప్రేమ సాగరమున గ్రుంకులిడి, ఆ ప్రేమసుధ నాస్వాదించి, అంతతో తృప్తిగాంచక, ఆ యమూల్య విశేషముల దన సోదర ముముక్షుకోటి కందించు మద్దేశమున, Mother Worship in India 'భారతదేశ శక్తిపూజ' అను గ్రంథమును లిఖించి, 'ఎవరి కరుణా కటాక్షముచే నీ రచయిత సమస్త స్త్రీలయందును జగన్మాతృ రూపమును దర్శించెనో ఆ శ్రీ శారదామాత పాదపద్మములకు గ్రంథము భక్తిపూర్వకముగా సమర్పితము' అని ఆ గ్రంథమును తన యిష్టదేవత యగు శ్రీ శారదామణీదేవి చరణ సరోజములకే యంకిత మొనర్చి శారదానందస్వామి తన జీవితమును సార్థకమొనరించుకొనెను. తాను ఆమె సాన్నిధ్యమున మెలగుచు పునీతుడై, తన నామధేయమును, దివ్యమాత యగు శారదాదేవి పుణ్యనామముతో శోభింప జేయుటకో యనునట్లు అందు మొదటి యక్షరత్రయమును జమ జేర్చుకొని విభూతీభూతముగావించి, అంతట తన రచనము కూడా పవిత్రవంతమై యొప్పార వలయునను దృఢ సంకల్పముతో దానిని గూడా ఆమెకే అర్పించి, మూడు విధముల నామెతో సన్నిహితత్వమును బడసెను. అది ఆ మహానుభావుని దివ్యసంకల్పశక్తియై యుండనోపు.

అటు ఆమెయందు విశేష భక్తిప్రపత్తులు గల్గి శ్రీ శారదానంద, యోగానంద, గోలప్‌మాయి మున్నగు శిష్య

బృందము ఆమెకై శాశ్వతముగ నొక మఠమును బాగ్
బజారులో నిర్మించిరి. దానికి 'ఉద్బోధన్' అని నామకర
ణముజేసి శ్రీ శారదాదేవి ఎల్లప్పుడట నుండ నేర్పాటు
జేసిరి. అప్పటికే శ్రీ శారదాదేవి బలరామబోసు, పీలాంబర
ముఖర్జి మొదలగువారి గృహముల గొంతకాల ముండి,
తీర్థవ్రతము గావించి, తన కొరకేతెంచు భక్తులకు
పీయూషతుల్యములగు మృదు మధురవాక్కులచే, నాధ్యాత్మిక
విషయముల బోధించుచు, దరచు సమాధి తుల నమభవిం
చుచు, నొక సమయమున నిర్వికల్పమును గూడ అనుభ
వించియు నుండుటచే నామె కీర్తి జగద్విఖ్యాతమై వెలు
గొందెను. దాననామె దర్శనాపేక్షతో ఆమె యమృత
వాక్కుల నాలకించుటకై, వేలకొలది భక్తు లరుదెంచ
సాగిరి. సుగంధసంయుక్తమగు కుసుమము వికసించుట
తోడనే యందలి మకరందమును గ్రోల బిలువకయే మధు
పము లరుదెంచుచందము. ఆధ్యాత్మికానుభవానందామృత
సమేతమగు శ్రీ శారదా పద్మము వికసించినతోడ, నాయా
ధ్యాత్మిక మకరంద పరిమళము పిల్లవాయువులచే సర్వత్ర
ప్రసరించి, యా పారమార్థిక సుధాస్వాదనమునకై యనేక
భక్తగణములు ఆమె నాశ్రయింప నారంభించిరి. వ -ము

శవ సువాసనను. కొందరినే యాఘ్రాణింపు మనుటయు గొందరిని వలదనుటయు నెట్లుండదో యట్లే మన శారదాదేవి సన్నిధానము జాతి వర్ణ మత లింగ భేదములేక సర్వసమత్వమును బ్రకటించుచుండెను.

ఇట్లు పారమార్థిక వియద్వ్యాహారమున నానందడోలికల నూగుచున్నను, బూర్వోక్తముగ సర్వసమత్వమును తన శిష్యకోటియగు ఆధ్యాత్మిక బంధువులందును, శారీరక సంబంధులగు బంధుకోటియందును మన శారదామాయి జూపుచుండెను. బంధువర్గమామె నాశ్రయించియున్నను వారి మధ్యనే తన జీవితమును గడుపుచున్నను, ఎట్టి యహంకార మమకారపాశముల దగుల్కొనక 'పద్మపత్ర మివాంభసా' అనురీతి నళినీదళ జలకణమువోలె స్వచ్ఛమై యామె ఎవ్విధమున బ్రవర్తించెనో గ్రహించెదము గాక: సంసారమున బంధుమిత్రులతో నివసించుచు భగవ ద్దర్శనమును బొంద సాధ్యమా యని ప్రతి వ్యక్తికి కలుగు శంకయే యిది. గృహమున నివసించియు, నీషణమూలం బారద్రోలి నిర్మలహృదయుడై, తమ్మర పుష్పము మట్టిలో నున్నను ఎట్లు దానికి సుంతయైన నడుసుయంటదో, యట్లే సంసారమునన్నచో ముక్తి కరతలామలక మగును. 'అయం నిజః పరోవేతి గణనా లఘు చేతసాం' ఇతడు స్వ, ఇతడు పర అను భేదము సంకుచిత మనస్కులకు గలుగును.

స్వార్థపరులకు సంకుచితాది యవలక్షణములుగాని విశాల హృదయుల హృదయమున విశ్వప్రేమయే సర్వస్వము వలెను. జగన్మాతయగు భవతారిణిని బూజించి, విశ్వం విశ్వవ్యాపకమగు ప్రేమజలధిలో మన శ్రీ రామకృష్ణ దేవునికి సర్వార్పణము గావించి. ఆ పవిత్రప్రేమ వీచికం తన్మయత్వము నొందిన సహజ ప్రేమరూపిణియగు మన శారదయందు విశ్వమాన ప్రేమగాక సంకుచితత్వము వెలయునా? ఆ ప్రేమయేగదా మూర్ఖులకు సహితము పరివర్తనము కలిగించు దిః అట్టి ప్రేమయేగదా భగవత్సాన్నిధ్యము చ్చునది. ఆ ప్రేమచేతనే గదా శిష్య సమూహ మలెంచుటః ఆ ప్రేమచేతనే గదా సంఘము అభివృద్ధి చెందుటః ఆమె ఆంధ్ర సమాజమున వెలిసి, గృహస్థుల కెల్ల ఆదర్శప్రాయమైనదో గ్రహించెదముగాక.

శ్రీ శారదాదేవి కలకత్తాలో నుండుచున్నను, అప్పుడప్పుడు తన ముదుసలి తల్లియగు శ్యామసుందరిని, తన తమ్ములగు ప్రసన్నకుమార, వరదాప్రసాద, కాళీకుమార, అభయచరణులను జూచుటకును, సోదరులు పసివారలగుట వారికి తోడ్పడుటకును జయరాంవాటియందు గొన్నిమాసములుండెడిది. అప్పుడు తన శారదామాయియే ధాన్యము దంచుచు, వంట చేయుచు, సర్వవ్యవహారముల జక్కబెట్టుచుండెడిది. అంతయగాక తన జ్యేష్ఠ సోదరుని భా

యిరువురు బాలికలను గూడ నామెయే తల్లివలె రక్షించెడిది. మరియు తన నాల్గవ సోదరుడగు అభయచరణుడు ఆమెకు ఎక్కువ ప్రేమ పాత్రుడు. ఇతడు విషూచివ్యాధి కాహుతియై 1899 వ సంవత్సరమున మరణమయ్యెనండి. సోదరియగు శ్రీ శారదను వీక్షించి తన భార్యయగు సురబాలను, ఆమెకు గలుగబోవు శిశువును ఆమెకు ఒప్పగించుచు 'నీవే వారికి సర్వమును' అని శరీరమును బాసెను. అప్పటికి దుర్బలయగు సురబాలకు నీ కష్టముతో మనోచాంచల్యము గలిగెను. అట్టి యున్మాదస్థితిలో నామె యొక యాడశిశువును గనుటచే, నా యిరువురి పోషణభారము పైన శారదమీద బడెను. శిశువగు రాధారాణియు, శారదామాయియే తన విషయముల నెక్కువగ విచారించుటచే, నామెనే తల్లిగ భావించి, కాలక్రమమున 'నమ్మా' యని పిల్చుచు, నామెను విడనాడకుండెడిది. కొంతకాలము ఆ గ్రామమున శారదాదేవి యుండి కలకత్తకు నేతెంప నా బిడ్డయు నామె వెంట బాటున సహాయముగ నుండుట చేతను, ఆ బిడ్డకు తగు సదుపాయము లిచ్చుటల్లి సేయజాలకుండుట చేతను, వారియువురి బాధ్యత శ్రీ శారదపై నుండుట చేతను వారిని గూడ మన శారదామాయి కలకత్తకు రప్పించి వారికి వసతుల గూడ జొచ్చెను. కాలక మమున తల్లి పిచ్చి బిడ్డయగు రాధారాణికి గూడ పట్టువడుటచే వీరిరువురి మూలమున నామె యనేక